

● ఎక్కడికక్కడ వెలిసిన బెల్ట్ షాపులు ● టీడీపీ నేతల కనుసన్నల్లో నిర్వహణ ● పల్లెలు, కాలనీల్లో అందుబాటులో మద్యం ● బెల్ట్ షాపులను ప్రోత్సహిస్తున్న వ్యాపారులు ● తూతూమంత్రంగా కేసులు, దాడులతో ఎక్సైజ్ సరి ● నియంత్రణలో వైఫల్యం.. మామూళ్ల వసూళ్లలో అధికారులు

వాడవాడలా.. మద్యం



ప్రభుత్వ మద్యం దుకాణాలు పోయి.. ప్రైవేటు వైన్స్ వచ్చేశాయి. కావాల్సిన బ్రాండ్లు కొనుక్కోవచ్చు. తాగొచ్చు. అయితే ఎక్కడో ఉన్న వైన్స్‌కు వెళ్లి కొనుక్కునేందుకు ఇబ్బంది పడకుండా అందుబాటులో కూడా మద్యం దొరికే సౌలభ్యం ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ప్రతీ పల్లెలోనూ, పట్టణాల పరిధిలోని కాలనీల్లోనూ ఉంది. ఇంటి నుంచి బయటకు వచ్చి సమీపంలోని బడ్డీ కొట్టుకు వెళ్తే మందు దొరుకుతుండటంతో మందుబాబులు ఖుషీఖుషీగా ఉంటున్నారు. ఆదాయం అధికంగా ఉంటుండటంతో బెల్ట్ షాపుల నిర్వహణకు పలువురు పోటీపడుతున్నారు. ఇదే అవకాశంగా గ్రామాల్లోని అధికార పార్టీ నాయకులు బెల్ట్ షాపుల నిర్వహణకు ముందుకొస్తున్నారు. అధికారులు కూడా తూతూమంత్రంగా దాడులు, కేసులతో సరిపెడుతున్నారు. బెల్ట్ షాపుల నియంత్రణపై అధికారులు దృష్టి పెట్టడంలేదు. దీంతో ప్రతి గ్రామం, కాలనీల్లో ఎనీటైం మద్యం అందుబాటులో ఉంటుంది.



ఇటీవల ముప్పాళ్ళ మండలంలోని ఓ గ్రామంలో మద్యం బెల్టు షాపు నిర్వాహకుడిని ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. అతడి నుంచి మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. స్టేషన్‌లో పని చేసే కానిస్టేబుల్ ఒకరు కేసు పెట్టించుకుంటావా?, సార్‌తో సెటిల్ చేసుకుంటావా? అంటూ బెదిరించాడు. దీంతో భయపడిన బెల్టు షాపు నిర్వాహకుడు కానిస్టేబుల్ చెప్పినంత డబ్బులు సమర్పించుకుని కేసు లేకుండా బయటపడ్డాడు. ఇలా అధికారులకు బెల్ట్ దుకాణంపై ఫిర్యాదు అందితే దానిని నియంత్రించకుండా కేసులతో బెదిరించి మామూళ్లు పిండుకుంటున్నారన్న ఆరోపణలున్నాయి.

దొరికితే.. పండుగే

ఆంధ్రజ్యోతి ఫోకస్

డిపాజిట్ కడితేనే బెల్ట్

రేపల్లెలో బెల్టు షాపుల నిర్వహణ కోసం చిన్న గ్రామమైతే రూ.50,000, పెద్ద గ్రామానికి రూ.లక్ష డిపాజిట్ చేసేలా మద్యం షాపుల యజమానులు రేటు ఫిక్స్ చేసినట్లు తెలుస్తోంది. కర్లపాలెం మండల పరిధిలో రెండు గ్రామాలలో బెల్టు షాపుల నిర్వహణకు పోటీ అధికంగా ఉండడంతో పంచాయితీ నడుస్తున్నట్లు సమాచారం. వేమూరు నియోజకవర్గ పరిధిలో బెల్టు షాపుల నిర్వహణకు దాదాపు రూ.3 లక్షలు ధర నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఇందుకు సంబంధించి గ్రామాలలో ఇంతకుముందే ఈ బెల్టు షాపులు నిర్వహించిన వారికే ప్రస్తుతం కూడా ఆఫర్ ఇచ్చినట్లు సమాచారం. బెల్టు షాపులు ఎక్కడ జోరుగా నడుస్తున్నాయోనని తెలుసుకుని వాటిని తమ ఆధీనంలోకి తెచ్చుకునేందుకు మద్యం వ్యాపారులు ప్రయత్నిస్తున్నారు. పల్నాడులో మద్యం దుకాణాల నిర్వాహకులు రూ.50 వేలు వసూలు చేసుకుని బెల్ట్‌షాపు నిర్వహణకు అనుమతి ఇవ్వడంతో పాటు అక్కడకు మద్యం సరఫరా చేస్తున్నారు.



రూ.50 వరకు అదనం..

రూ.లక్షలు కట్టి వైన్స్ లైసెన్సు పొందిన వ్యాపారులు బెల్ట్ షాపుల ద్వారా మద్యం విక్రయాలను ప్రోత్సహిస్తున్నారు. ఈ క్రమంలో ఒక్కో క్వార్టర్ బాటిల్‌కు అదనంగా రూ.10 తీసుకుని బెల్ట్ దుకాణాలకు మద్యం సరఫరా చేస్తున్నారు. వారు బ్రాండ్లను బట్టి రూ.40 నుంచి రూ.50 వరకు వసూలు చేస్తున్నారు. తమ ప్రాంతం నుంచి వైన్స్‌కు వెళ్లకుండా అందుబాటులో మద్యం దొరుకుతుండటంతో మందుబాబులు అదనపు మొత్తాన్ని భారంగా భావించడంలేదు. ఏ సమయంలోనైనా కావాల్సిన మందు దొరుకుతుండటంతో మందుబాబులు బెల్ట్ దుకాణాలను ఎక్కువగా ఆశ్రయిస్తున్నారు.

(ఆంధ్రజ్యోతి - న్యూస్‌నెట్‌వర్క్)

కూటమి ప్రభుత్వం కొత్త మద్యం పాలసీ తీసుకొచ్చి నెలరోజులు అవుతుంది. ప్రభుత్వ మద్యం దుకాణాలను రద్దు చేసి ప్రైవేట్ వైన్స్ షాపు లకు అనుమతించింది. ఇదే సమయంలో అన్ని ప్రాంతాల్లో, గ్రామాలలో వాడవాడల మద్యం బెల్టు షాపులు కూడా వెలిశాయి. గతంలో ప్రభుత్వ వైన్స్ కావడం.. డిమాండ్ ఉన్న బ్రాండ్లు అందుబాటులో లేక పోవడంతో బెల్ట్ షాపులపై పెద్దగా ఎవరూ దృష్టి సారించలేదు. ప్రస్తుతం ప్రైవేటు వ్యక్తులు వైన్స్ నిర్వహిస్తుండటం.. వారి ద్వారా కావాల్సినంత మద్యం, కోరిన బ్రాండ్లు దొరుకు తుండటంతో బెల్ట్‌షాపుల యథేచ్ఛగా వెలిశాయి. వైన్స్ లైసెన్స్‌దారులతో సిండికేటైన కొందరు నేతలు గ్రామాల్లో తమ అనుచరుల ద్వారా బెల్ట్‌షాపులను నిర్వహిస్తున్నారు. ఎక్కడికక్కడ అధికార పార్టీ నేతల అండ ఉండటం, కొన్ని దగ్గర వారి అనుచరులే దుకాణాల నిర్వహి స్తుండటంతో వీటిని అడ్డుకునే వారే లేకుండా పోయారు.

కొన్ని ప్రాంతాల్లో బెల్ట్ షాపుల బెడదతను తట్టుకోలేక స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేస్తున్నా ఫలితం ఉండటంలేదు. ప్రతి గ్రామంలోనూ మూడు నుంచి నాలుగు వరకు బెల్ట్ షాపులు నడుస్తున్నాయి. బెల్టు ద్వారానే ఎక్కువ ఆదాయం వస్తుందని గ్రహించిన మద్యం వ్యాపారులు కూడా వాటిని ప్రోత్సహిస్తున్నారు. బెల్టు నిర్వహించుకునే వారి నుంచి రూ.2 నుంచి రూ.5 లక్షల వరకు ప్రాంతాన్ని బట్టి వసూలు చేస్తున్నారని సమాచారం. ఈ వసూళ్ల క్రమంలో కొన్ని గ్రామాల్లో నేతలు, మద్యం వ్యాపారుల మధ్య వివాదాలు కూడా చోటుచేసుకుంటున్నాయి.

ఎనీటైం మద్యం..

బెల్ట్ దుకాణాలతో పలు కాలనీల్లో, పల్లెల్లో మద్యం మందుబాబులకు చేరువైంది. కొన్ని గ్రామాల్లో డోర్ డెలివరీ సౌకర్యాన్ని కూడా వ్యాపారులు అమలు చేస్తున్నారని సమాచారం. బెల్ట్‌షాపుల్లో 24 గంటలూ మద్యం అమ్మకాలు జరుగుతున్నాయి. మందుబాబులు తెల్లవారుజాము నుంచే ఆయా షాపుల వద్ద బహిరంగంగానే మద్యం తాగుతున్నా అధికారులు, పోలీసులు కూడా అటువైపు కన్నెత్తి చూడటంలేదు. బెల్టుషాపుల ద్వారా మద్యం విక్రయాలు విచ్చలవిడిగా సాగుతున్నాయి. అమ్మేవారు కూడా తాము అధికారులను ప్రసన్నం చేసుకునే విక్రయాలు జరుపుతున్నామని చెబుతుండడం విశేషం. బెల్ట్ దుకాణాల బెడదపై అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని ఆయా ప్రాంతాల ప్రజలు మండిపడుతున్నారు. బెల్టుషాపులు యథేచ్ఛగా నడుస్తున్నా మొక్కుబడి కేసులతో ఎక్సైజ్ అధికారులు సరిపెడుతున్నారన్న విమర్శలున్నాయి. దాడుల్లో పట్టుబడ్డ మద్యం ఏ షాపు నుంచి వచ్చిందో మూలాలను కనుక్కొని వాటిపై చర్యలు తీసుకోవడంలేదు.

● గుంటూరుకి సమీపంలోని గొర్లవారిపాలెం, రాజీవ్‌గృహకల్ప, పలకలూరు, రాజేశ్వరావుకాలనీ, ఓబులనాయుడిపాలెం, వెంగళాయపాలెం, బుడంపాడు, లాల్‌పురం, నగరంలోని శివారు కాలనీల్లో

(మిగతా 6వ పేజీలో)



● ధాన్యం సేకరణకు కృత్రిమ మేథ సాయం
● వాట్సాప్ నంబరు అందుబాటులోకి తెచ్చిన ప్రభుత్వం
● 7337359375 నంబరుకు హెచ్ఐ అని నమోదు చేస్తే చాలు

స్మార్ట్‌గా కొనుగోళ్లు

గుంటూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ధాన్యం రైతులు కొనుగోలు కేంద్రాల వద్ద అమ్ముకోవడానికి పడుతున్న ఇబ్బందుల దృష్ట్యా కూటమి ప్రభుత్వం ఈ దఫా టెక్నాలజీని అందుబాటులోకి తీసుకొచ్చింది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రైతు భరోసా కేంద్రాల వద్ద ధాన్యం రైతులు పడిగాపులు పడాల్సి వచ్చేది. అధికారుల దయాదాక్షిణ్యాల మీద ఆధారపడి ధాన్యాన్ని విక్రయించుకోవాల్సిన పరిస్థితి. వీటికి ఫుల్‌స్టాప్ పెడుతూ కూటమి ప్రభుత్వం ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్(కృత్రిమ మేథ) సాయాన్ని తీసుకుంటోంది. రాష్ట్ర పౌరసరఫాల సంస్థ వాట్సాప్ నంబరు 7337359375ని అందుబాటులోకి తీసుకొచ్చింది. రైతులు ఈ నంబరు ద్వారా ధాన్యాన్ని ఎప్పుడు విక్రయించుకోవచ్చో వారే స్వయంగా తేదీ, సమయాన్ని ఎంచుకోవచ్చు. దీని వల్ల ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద ఎదురవుతున్న ఇబ్బందులు వారికి ఉండవని పౌరసరఫరాల సంస్థ అధికారులు చెప్తున్నారు. రైతులు వాట్సాప్ నంబరుకి ఆంగ్లంలో హెచ్ఐ అని నమోదు చేయగానే వెంటనే ధాన్యం కొనుగోలుకు షెడ్యూల్, రీషెడ్యూల్ చేసుకోండి అని సందేశం వస్తుంది. షెడ్యూల్‌ని క్లిక్ చేయగానే దయచేసి మీ ఆధార్ సంఖ్యని నమోదు చేయమని కోరుతుంది. ఆధార్ నంబరు ఎంట్రీ చేయగానే సమీపంలో ఉన్న ధాన్యం కేంద్రాల జాబితా ప్రదర్శితమౌతుంది. వాటిలో ఏదో ఒక దానిని ఎంపిక చేసుకోవాలి. ఎంపిక చేసుకున్న వెంటనే తేదీలను ఇస్తుంది. తేదీని ఎంచుకోగానే టైం స్లాట్ ఇస్తుంది. టైంస్లాట్ ఎంచుకున్న తర్వాత ధాన్యం రకాన్ని ఎంపిక చేసుకోవాలి. ఆ తర్వాత ఎన్ని బస్తాలను అమ్మదలిచారో చెప్పాలని కోరుతుంది. పరిణామం తెలిపిన తర్వాత రైతు పేరు, గ్రామం, షెడ్యూల్ చేసిన తేదీ, కూపన్ కోడ్ వస్తుంది. ఒకవేళ రీషెడ్యూల్ చేసుకోవాలన్నా ఆ అవకాశం కూడా ఉంటుంది. ఈ-పంట నమోదులో పేర్లు నమోదు చేసుకున్న రైతులకు మాత్రమే ఈ అవకాశం ఉంటుంది. రైతు తాను సాగు చేసిన విస్తీర్ణం తక్కువగా ఉండి, ఎక్కువ బస్తాల ధాన్యం విక్రయించాలని చూసినా ఏఐ అనుమతించదు.

పంచాయతీలకు కాసుల వర్షం

ప్రభుత్వం నుంచి రూ.70.04 కోట్లు విడుదల

తీరనున్న సమస్యలు.. నిధులపై పాలకవర్గాల హర్షం



(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

నిధుల లేమితో కూనారిల్లిపోతున్న పంచాయతీలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధమైంది. వైసీపీ హయాంలో కేంద్రం నుంచి విడుదలయ్యే ఆర్థిక సంఘం నిధులను సైతం దారి మళ్లించి పంచాయతీలను నిర్వీర్యం చేసింది. కేంద్ర ఇచ్చే నిధులను నేరుగా పంచాయతీ ఖాతాలకు జమ చేస్తామని, పల్లెలో ప్రగతి పనులు చేపటడతామని, పంచాయతీలను ఆర్థికంగా బలోపేతం చేస్తామని ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేస్తోంది. ఈ క్రమంలో అధికారంలోకి వచ్చిన తర్వాత కూటమి ప్రభుత్వం రెండో విడత ఆర్థిక సంఘం నిధులను పంచాయతీ ఖాతాలకు జమ చేసింది. తాజాగా 2024-25 ఆర్థిక సంవత్సరానికి 15వ ఆర్థిక సంఘం నిధులు మొదటి విడతగా పల్నాడు, బాపట్ల, గుంటూరు జిల్లాలోని పంచాయతీలకు రూ.70.04 కోట్లు విడుదలయ్యాయి. పంచాయతీలకు అన్‌టైడ్ కింద రూ.28.21 కోట్లు, టైడ్ గ్రాంటు కింద రూ.41.82 కోట్లు విడుదలయ్యాయి. ఈ మొత్తాన్ని జనాభా ప్రాతిపదికన పంచాయతీల ఖాతాల్లో నిధులు జమ చేశారు. వైసీపీ పాలనలో ఐదేళ్లలో లేని విధంగా పంచాయతీ లకు కూటమి ప్రభుత్వం నిధులు విడుదల చేస్తుండటంతో పంచాయతీల పాలకవర్గాలు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నాయి. నిధుల లేమితో ఇబ్బందులు పడుతున్న పంచాయతీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు ఒకదాని వెంట విడుదల చేస్తుండటంతో గ్రామాల్లో సమస్యలు తీరనున్నాయి. టైడ్ నిధులను ఓడీఎఫ్ నిర్వహణ, ఇంటింటి నుంచి చెత్త సేకరణ, తాగు నీటి సరఫరా, రహదారులు వంటి పనులకు ఖర్చు చేసేందుకు ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది. ఈ నిధులను నిబంధనల మేరకు ఖర్చు చేయాలి. ఇందుకు సంబంధించిన లెక్కలు పక్కాగా ఉండాలని ప్రభుత్వం ఉత్తర్వుల్లో సూచించింది. ఆర్థిక సంఘం నిధులు విడుదలైన ప్రతిసారీ పంచాయతీల విద్యుత్ బకాయిలకు కొంత మొత్తాన్ని చెల్లించాలని ప్రభుత్వం ఆదేశిస్తోంది. అదే తరహాలో ఇప్పుడూ అన్‌టైడ్ గ్రాంటుగా విడుదల చేసిన రూ.28.21 కోట్లలో పది శాతం విద్యుత్ బకాయిలకు ఖచ్చితంగా చెల్లించాలని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. మరో పది శాతం నిధులను ఎల్‌ఈడీ వీధి దీపాల నిర్వహణకు, 20 శాతం నిధులను కాంట్రాక్ట్ సిబ్బంది వేతనాలు, కంప్యూటర్ల కొనుగోలు, స్టేషనరి ఇతర సామగ్రి కొనుగోలు చేసుకునే అవకాశం కల్పించింది. పాఠశాల భవనాల మరమ్మతులు, తాగునీటి వసతి, ఆట స్థలాల అభివృద్ధి వంటి పనులు ఖర్చు చేసుకోవాలని ప్రభుత్వం సూచించింది.

జిల్లాల వారీగా నిధులు విడుదల ఇలా..

జిల్లా	అన్‌టైడ్ నిధులు	టైడ్ నిధులు
పల్నాడు	12,31,45,384	18,47,18,101
బాపట్ల	9,34,29,265	14,01,43,899
గుంటూరు	6,55,92,007	9,83,88,023

ఇచ్చిన మాటకు కట్టుబడిన ప్రభుత్వం



వైసీపీ ప్రభుత్వం ఆర్థిక సంఘం నిధులను పంచాయతీలకు విడుదల చేయకుండా వేరే అవసరాలకు మళ్లించుకుంది. అధికారంలోకి రాగానే ఇచ్చిన మాటకు కట్టుబడి గ్రామ స్వరాజ్యం.. అభివృద్ధే ధ్యేయంగా సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లు కృషి చేస్తున్నారు. నిధులు విడుదల చేయడం హర్షణీయం.

-జాస్తి వీరాంజనేయులు, అఖిలభారత పంచాయతీ పరిషత్ జాతీయ ఉపాధ్యక్షుడు

రాత్రి వేళ మహిళల రక్షణే లక్ష్యం

ప్రత్యేకంగా టోల్ ఫ్రీ నెంబరు ఏర్పాటు

రైల్వేస్టేషన్, బస్టాండ్ వద్ద వాహనాలతో పోలీసులు

25న లాంఛనంగా ప్రారంభించనున్న ఎస్పీ సతీష్‌కుమార్



రాత్రి గుంటూరు.. సేఫ్

గుంటూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మహిళల భద్రతే ధ్యేయంగా "మహిళా.. నీకోసం" పేరుతో ఎస్పీ సతీష్‌కుమార్ ఓ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టబోతున్నారు. దూర ప్రాంతాల నుంచి రాత్రి వేళల్లో నగరానికి వచ్చే యువతులు, మహిళలు సురక్షితంగా ఇంటికి చేరడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించబోతున్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా టోల్ ఫ్రీ నెంబరును అందుబాటులోకి తీసుకురానున్నారు. రాత్రి 10.00 నుంచి తెల్లవారుజాము ఐదు గంటల మధ్య ఆర్టీసీ బస్టాండ్, రైల్వేస్టేషన్లకు ఇతర ప్రాంతాల నుంచి వచ్చే మహిళలు తమ ఇళ్లకు చేరుకునేందుకు అక్కడ ఏర్పాటు చేసిన కంట్రోల్‌రూమ్‌లలో లేదంటే టోల్ ఫ్రీ నెంబరును సంప్రదించాలి. ఇందుకోసం ఆయా ప్రాంతాల్లో కార్లు, ద్విచక్ర వాహనాలతో పోలీస్ సిబ్బంది సిద్ధంగా ఉంటారు. మహిళా ప్రయాణికుల నుంచి ఫోన్ కాల్ రాగానే వారిని సంప్రదించి సురక్షితంగా ఇళ్ళకు చేరుస్తారు. ఒంటరి మహిళ అయితే ద్విచక్ర వాహనం పైన, ఇద్దరి కంటే ఎక్కువ మంది ఉంటే కార్లలోనూ గమ్యస్థానాలకు చేరవేస్తారు. ఇందుకుగాను ఐదు కార్లు, 12 ద్విచక్ర వాహనాలను ఎంపిక చేశారు. ఈ నెల 25న ఎస్పీ సతీష్‌కుమార్ లాంఛనంగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. రాత్రివేళ ఇతర ప్రాంతాల నుంచి రైళ్లు, బస్సుల ద్వారా గుంటూరుకు వచ్చే మహిళలు తమ ఇళ్లకు చేరడానికి అనేక ఇబ్బందులు పడాల్సిన పరిస్థితులు ఉన్నాయి. ఒంటరి మహిళలు ఆటో ఎక్కితే డ్రైవర్ల ముసుగులో ఉన్న కొందరు వారిని దారిమళ్ళించి దోచుకోవడం లేదంటే బలాత్కారం చేస్తుంటారు. ఈ తరహాలో గతంలో నగర పరిధిలో పలు ఘటనలు జరిగినా కొందరు మహిళలు పరువు రీత్యా బయటకు చెప్పుకోలేక పోయారు. మరికొన్ని ఘటనలపై పోలీసులు కేసులు కూడా నమోదు చేశారు. ఈ నేపథ్యంలో ఇతర ప్రాంతాల నుంచి నగరానికి వస్తున్న మహిళలు ముందుగానే కుటుంబ సభ్యులకు ఫోన్లు చేసి రైల్వేస్టేషన్‌కో, బస్టాండ్‌కో పిలిపించుకోవాల్సిన పరిస్థితులు ఉన్నాయి. ఇక నుంచి ఆ అవసరం లేకుండా పోలీసులే వారిని సురక్షితంగా గమ్యస్థానానికి చేర్చనున్నారు. ఈ కార్యక్రమ పర్యవేక్షణ బాధ్యతలను మహిళా పోలీస్‌స్టేషన్ డీఎస్పీకి అప్పగించారు. గతంలోనూ ఓసారి ఈ తరహా కార్యక్రమాన్ని ప్రారంభించినా అది మూణ్నాళ్ల ముచ్చటగానే ముగిసింది. అప్పట్లో పోలీస్ వాహనాలు కాకుండా రైల్వేస్టేషన్, బస్టాండ్‌లో ఎంపిక చేసిన ఆటోల ద్వారా మహిళలను వారి గమ్యస్థానాలకు చేర్చేవారు. అయితే ఇది ఎక్కువ రోజులు కొనసాగలేదు. అయితే ఈ సారి ఎస్పీ సతీష్‌కుమార్ ప్రైవేటు ఆటోలతో సంబంధం లేకుండా నేరుగా పోలీసు వాహనాలతో పోలీసులే మహిళలను గమ్యస్థానాలకు చేర్చేలా కార్యక్రమాన్ని రూపొందించారు.



ఎస్పీ సతీష్‌కుమార్

అర్ధరాత్రి.. అత్యవసర పరిస్థితులు ఎదురైనా...

రైల్వే స్టేషన్, బస్టాండ్ నుంచి ఒంటరి మహిళలను గమ్యస్థానాలకు చేర్చేందుకు రూపొందించిన ఈ కార్యక్రమంతో పాటు నగర పరిధిలో మహిళకు ఏదైనా పోలీస్ పరమైన అత్యవసర పరిస్థితి ఏర్పడితే వారు ఫోన్ చేయగానే సంబంధిత సిబ్బంది స్పందించి వారి వద్దకు వెళ్లి పోలీసు సాయం అందించేలా ఈ కార్యక్రమాన్ని విస్తృతం చేస్తే ఎలా ఉంటుందనే దానిపై కూడా పోలీసు ఉన్నతాధికారులు ఆలోచన చేస్తున్నారు. ప్రస్తుతం నగరంలో బ్లూ కోల్ట్స్, రక్షక్ వాహనాలు ఉన్నప్పటికీ చాలా వాహనాలు మూలనపడ్డాయి. ఆయా వాహనాలపై సరిపడా సిబ్బంది లేకపోవడంతో డయల్ 100, 112 ఫోన్ కాల్స్‌పై సత్వరం స్పందించడానికి కొంత ఇబ్బందిగా ఉంది. అర్ధరాత్రి అపాయంలో ఉన్న మహిళల నుంచి ఫోన్ కాల్ వస్తే పోలీసులు సాయం అందించేలా చర్యలు తీసుకుంటే ఈ కార్యక్రమం విజయవంతమయ్యే అవకాశాలు ఉంటాయని భావిస్తున్నారు. దీనిని ఇప్పుడే ప్రారంభించాలా కొంత సమయం తర్వాత అనేదానిపై యోచిస్తున్నారు.

వివరాలు 6లో

విద్యార్థి మృతిపై జడ్జి విచారణ

● పొన్నెకల్లు జడ్పీ పాఠశాల ఘటనపై లీగల్ సర్వీసెస్ దృష్టి

14న జాతీయ లోక్ అదాలత్

● అన్ని కోర్టుల్లోనూ నిర్వహణకు ఏర్పాట్లు

గుంటూరు - సికింద్రాబాద్ ఆర్ఆర్‌బీ స్పెషల్స్


పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థుల సౌకర్యార్థం

24 నుంచి 29 వరకు నడపనున్న రైల్వే



ఔషధ నిరోధకతపై

ఆందోళన



8

● మొండికేస్తున్న సూక్ష్మజీవులు
● మందులూ ప్రభావం చూపడం లేదు
● 24వ తేదీ వరకు అవగాహన వారోత్సవాలు

మూడు నెలలైనా.. ఇబ్బంది లేదు

పింఛన్‌దారులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త

ఉమ్మడి గుంటూరు జిల్లాలో 7.59 లక్షల మందికి లబ్ధి



---

3 వంతెనల కింద... రాకపోకలు బంద్

◆ 25 నుండి రైల్వే ట్రాక్ విస్తరణ పనులు ప్రారంభం ◆ 60 రోజులపాటు రాకపోకలు నిషేధం ◆ కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని అరండల్ పేట నుండి కొత్తపేట వైపు వెళ్లే ప్రధాన మార్గమైన 3 వంతెనల వద్ద రైల్వే శాఖ నూతన ట్రాక్ విస్తరణ పనుల వలన ఈ నెల 25 నుండి 60 రోజుల పాటు రాక పోకలు నిలిపి వేస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. గురువారం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో రైల్వే, ట్రాఫిక్, ఆర్అండ్‌బీ, జీఎంసీ అధి కారులతో 3 వంతెనల రాకపోకల నిలిపివేత, ప్రత్యామ్నాయ చర్యలపై సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ట్రాక్ విస్తరణ పను లను చేపట్టడానికి 60 రోజుల పాటు 3 వంతె నల మార్గంలో రాకపోకలు నిలిపివేయాలని రైల్వే అధికారులు కోరారన్నారు. నగర ప్రజలు గమనించి, నెహ్రూ నగర్ గేటు, శంకర్ విలాస్ వంతెన వైపు నుండి కొత్తపేటకు వెళ్లాలని సూచించారు. సమావేశంలో జీఎంసి ఎస్ఈ నాగమల్లేశ్వరరావు, సిటీ ప్లానర్ రాంబాబు, ఆర్అండ్‌బీ డీఈఈ చిన్నయ్య, పశ్చిమ ట్రాఫిక్ సిఐ సింగయ్య, రైల్వే ఏడీ ఎన్ జగన్మోహనరావు పాల్గొన్నారు.



జీజీహెచ్‌లో మందులు అందక రోగుల అవస్థలు

- నెల రోజులకు ఇవ్వకుండా.. ఐదు రోజులకే సరిపెడుతున్న సిబ్బంది
- షిఫ్టుల వారీగా విధులు కేటాయించాలంటూ ఫార్మసిస్టుల గగ్గోలు

గుంటూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): జీజీహెచ్‌కి సంబంధించి గత సూపరింటెండెంట్ తీసుకున్న అనాలోచిత నిర్ణయంతో రోగులకు అష్టకష్టాలు తప్పడం లేదు. దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నవారికి జీజీహెచ్ లో నెలకోసారి మందులు ఇస్తుంటారు. ఆయా మందుల కోసం సాధారణ రోగులతోపాటు వృద్ధులు, దివ్యాంగులు, మహిళలు సైతం పెద్ద సంఖ్యలో వస్తుంటారు. ఒక్క గుంటూరు జిల్లా నుంచే గాక పొరుగు జిల్లాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో రోగులు నెలవారీ మందుల కోసం జీజీహెచ్‌కి వస్తుంటారు. అయితే ఇక్కడ ఆయా రోగులు ముందుగా ఓపీ నమోదు చేసుకొని తీసుకోవడానికి నానా తంటాలు పడాల్సి వస్తుంది. ఆ తర్వాత క్యూలైన్‌లో నిలిచి వైద్యునికి చూయించుకోవడం ఒక ప్రహసనంగా మారుతుంది. ఉదయం నుంచి ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొని చివరకు మందులు చీటీ తీసుకొని ఆయా వార్డుల వద్ద క్యూలైన్లో నిల్చుని ఉంటే అర్ధాంతరంగా మూసివేయడమో, లేదంటే ఫార్మాసిస్టులు సమయం ముగియడంతో వెళ్లిపోయారనో సమాధానం వస్తుంది. అదేమంటే కొత్త భవనంలో మందులు ఇస్తారని, అక్కడికి వెళ్లమని చెబుతున్నారు. పాత భవనం నుంచి రోగులు కొత్త భవనానికి వెళ్లాలంటే అది ఒక పెద్ద సమస్యగా ఉంది. రోగులు, వృద్ధులు, పిల్లలు, మహిళలు అయితే ఆటో మాట్లాడుకొని కొత్త బిల్డింగ్ వద్దకు వెళ్లాల్సి ఉంటుంది. అయితే అక్కడ కేవలం ఐదు రోజులకే మందులు ఇస్తున్నారు. మందులు తీసుకునే విషయంలో రోగులకు అనేక ఇబ్బందులు ఏర్పడడానికి గత సూపరింటెండెంట్ కిరణ్ కుమార్ తీసుకున్న నిర్ణయమే కారణమని పలువురు రోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నానా తంటాలు..

షిఫ్టుల వారీగా విధులు కేటాయించినట్లయితే ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు, మధ్యాహ్నం రెండు గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు రెండు షిఫ్టుల సిబ్బంది విధులు నిర్వహిస్తుంటారు. అయితే ఇక్కడ పాత భవనంలోని ఫార్మసిస్టులను షిఫ్టులతో సంబంధం లేకుండా ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు విధులు నిర్వహించాలంటూ ఆదేశాలివ్వడంతో ఇక్కడ రోగులకు మందులు తీసుకునే విషయంలో సమస్యలు ఎదురవుతున్నాయి. ప్రస్తుతం పాత భవనంలో ఓపీ ఉదయం నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు కొనసాగుతుంది. ఆయా ఓపీలకు అనుబంధంగా మందులు ఇచ్చే 3,13, 10బి, 14బి, 21, 26, స్టోర్ ఇలా ఆయా వార్డుల్లో విధులు నిర్వహించే ఫార్మసిస్టులకు మధ్యాహ్నం రెండు నుంచి మూడు గంటల వరకు భోజన విరామం ఉంటుంది. ఆ సమయంలో ఆయా మందులు ఇవ్వడం నిలిపివేస్తారు. అయితే ఓపీ చూపించుకుని మందులు రాయించుకున్న రోగులు ఆ సమయంలో మందులు ఇవ్వకపోతుండడంతో మూసివేశారని భావించి వెనుతిరిగి వెళ్తున్నారు. మరికొందరైతే కొత్త భవనంలోకి వెళ్లాలని సలహా ఇస్తుండడంతో రోగులు, వారి సహాయకులు అక్కడకు వెళ్లడానికి నానా తంటాలు పడు తున్నారు.

ఫార్మసిస్టులకు షిఫ్టుల వారీగా విధులు కేటాయిస్తే..

ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు, తిరిగి రెండు నుంచి రాత్రి 8 గంటల వరకు ఆయా కౌంటర్లను కొనసాగిస్తే దూర ప్రాంతాల నుంచి వచ్చే రోగులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఉంటుంది. ఇటు రోగులకు అటు ఫార్మసిస్టులకు ఇబ్బంది లేకుండా ఉండాలంటే పాత భవనంలో కూడా షిఫ్టుల వారీగా ఆయా మందులు ఇచ్చే కౌంటర్లను కొనసాగిస్తే ఉదయం నుంచి రాత్రి వరకు మందులు ఇచ్చే ఫార్మా వార్డులు తీసే ఉంటాయి. గతంలో మధ్యాహ్నం తర్వాత ఆయా ముందులు ఇచ్చే వార్డులన్నింటిని మూసివేసినప్పటికీ వాటన్నింటికీ సంబంధించి 13వ వార్డులో రాత్రి వరకు మందులు ఇస్తుండే వారని రోగులు చెబుతున్నారు. కనీసం ఆ విధంగా మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు 13వ నంబరు వార్డులో అన్ని వార్డులకు సంబంధించిన మందులు అక్కడ అందుబాటులో ఉంచినా సరిపోతుందని వారు కోరుతున్నారు. ఇకనైనా జీజీహెచ్ సూపరింటెండెంట్ దీనిపై దృష్టి సారించి పాత భవనంలో ఫార్మసిస్టులకు షిఫ్టుల వారిగా విధులను కేటాయించి తద్వారా రోగులకు మందుల ఇబ్బందులు లేకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.





అనంత విజయకు బెస్ట్ ఫిషర్ ఎంటర్‌ప్రైజర్ అవార్డు అందజేస్తున్న మత్స్య శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు,మంత్రి కొల్లు రవీంద్ర తదితరులు

మత్స్యకార మహిళ అనంత విజయ్‌కు అవార్డు

బాపట్ల, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): బాపట్ల మండలంలో హేచరీ నిర్వహిస్తున్న ఏకైక ఫిషర్ ఉమెన్ అనంత విజయ్‌కు బెస్ట్ ఫిషర్ ఎంటర్ ప్రైజర్ అవార్డు లభించింది. ప్రపంచ మత్స్యకార దినోత్సవం సందర్భంగా విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో గురువారం నిర్వహించిన వేడుకల్లో అనంత విజయ్‌కు రాష్ట్ర మత్స్యశాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు, మంత్రి కొల్లు రవీంద్రల చేతుల మీదగా ఈ అవా ర్డును అందజేశారు. దేశవ్యాప్తంగా 462 హెచరీలు ఉండగా మహిళ నిర్వహిస్తున్న హెచరీ బాపట్ల మండలంలో మాత్రమే ఉంది. ఆమె ప్రతిభను గుర్తించి అవార్డును అందజేశారు. దేశంలోనే మొదటిసారిగా అవార్డు అందుకున్న ఫిషర్‌ఉమెన్‌గా ఆమె నిలిచారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు ఆమెను అభినందించారు. కార్యక్రమంలో జాతీయ మత్స్యకార సంఘం సెక్రటరీ జనరల్ అనంత నగేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



ప్రథమస్థానంలో నిలిచిన గుంటూరు జిల్లా ఎడ్లజత

సత్తా చాటిన గుంటూరు జిల్లా ఎడ్ల జత

- ముగిసిన ఎడ్ల బండలాగుడు పోటీలు

దుర్గి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మవరంలోని శ్రీహరిహర బాలనాగేంద్రస్వామి వార్షిక మహోత్సవాల సందర్భంగా నిర్వహిస్తున్న ఎడ్లబండ లాగుడు పోటీలు ముగిశాయి. చివరి రోజైన గురువారం ఆరుపళ్ల విభాగం పోటీలు జరపగా, ఈ పోటీలను ఎంపీపీ యేచూరి సునీతాశంకర్, టీడీపీ సీనియర్ నేత లింగా రమేష్, జనసేన జిల్లా కార్యదర్శి పులిహరి, మండల అధ్యక్షుడు తోటకూర శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ పోటీల్లో గుంటూరు జిల్లా కొల్లిపరకు చెందిన మోదుగుల రామిరెడ్డి, కృష్ణకిషోర్‌రెడ్డి ఎడ్లజత నిర్ణీత సమయంలో పందెపు బండను 4938 అడుగుల దూరం లాగి ప్రథమస్థానం కైవసం చేసుకున్నాయి. గుంటూరు జిల్లా పాలడుగుకు చెందిన బీఎల్‌కే బుల్స్ శశాంక్ శ్రేయా, వెంకటగిరి, విజయ్ పవన్ కుమార్ ఎడ్ల జత 4638.10 అడుగులతో రెండోస్థానం, గుంటూరు జిల్లా పెదగొట్టిపాడుకు చెందిన జీఎల్‌ఆర్ బుల్స్ గరికపాటి లక్ష్మయ్య చౌదరి ఎడ్లజత 4500 అడుగులతో మూడోస్థానం, ప్రకాశం జిల్లాకు చెందిన శ్రీనివాసరావు ఎడ్లజత 4277 .07 అడుగులతో నాలుగోస్థానం, పల్నాడు జిల్లా పెదకూరపాడుకు చెందిన ఏటుకూరి శ్రీనివాసరావు ఎడ్లజత 4250 అడుగులతో ఐదోస్థానం, నంద్యాల జిల్లా బిల్లాలపురానికి చెందిన భుమ్మ గోవర్ధన్‌రెడ్డి ఎడ్లజత 4250 అడుగులతో ఆరోస్థానం, పల్నాడు జిల్లా గురజాలకు చెందిన అంజయ్య ఎడ్లజత 4240.07 అడుగులతో ఏడోస్థానం దక్కించుకున్నాయి. ఈ పోటీలకు వ్యాఖ్యాతలుగా గూడా శ్రీనివాసరావు, సుబ్బారెడ్డి వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు గుండాల వెంకటేశ్వర్లు, ఆకుల రామలక్ష్మణ, వంకమళ్ల కోటేశ్వరరావు, నాదెండ్ల శ్రీను, కటకం రామారావు, గోళ్ల ఆంజనేయులు పాల్గొన్నారు.



మంద కృష్ణమాదిగను సత్కరిస్తున్న ఉండవల్లి శ్రీదేవి

ఎస్సీ వర్గీకరణకు కృషి చేసిన చంద్రబాబు

- ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ

తాడేపల్లి టౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): గతంలో ఎస్సీ వర్గీకరణ చేసింది నేనే.... చేయబోయేది నేనే అంటూ కంకణం కట్టు కున్న వ్యక్తి సీఎం చంద్రబాబు అని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్య క్షుడు మంద కృష్ణమాదిగ అన్నారు. గురువారం మాదిగ కార్పొరేషన్ ఛైర్మన్ ఉండవల్లి శ్రీదేవిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మీడియాతో మంద కృష్ణ మాట్లాడుతూ వైసీపీలో సోదరి శ్రీదేవిని అవమానించారని, చంద్రబాబు హయాంలోనే మాదిగల ఉద్యమం పెద్దఎత్తున లేచిందని మాదిగలు బలపడ్డారని వ్యాఖ్యానించారు. రిజర్వేషన్ ఫలాలు అన్ని వర్గాలకు అందాలని మాదిగ వర్గాలు అన్ని విధాలా వెనుకబడ్డాయని చెప్పారు. గత ఐదేళ్లలో ఏ కార్పొరేషన్‌కు నిధులు లేవని, వ్యాఖ్యానించారు. ఎస్సీలు ఏ పార్టీలో ఉన్నా వారిని అవ మానిస్తే సహించేది లేదన్నారు. డీఎస్సీ నోటిఫికేషన్‌ను అతి తక్కువ సమయంలో రెండు నెలల్లో విడుదల చేయాలని డీఎస్సీ కమిషన్‌ను కోరామన్నారు. ప్రభుత్వాన్ని కూడా పెద్ద మనస్సు చేసుకుని సమయం తగ్గించాలని కోరతామన్నారు. శ్రీదేవి మాట్లాడుతూ వర్గీకరణ కోసం నిలబడిన వ్యక్తి మంద కృష్ణమాదిగ అని చెప్పారు. అనంతరం మందా కృష్ణమాదిగను ఆమె సత్కరించారు.

గుంటూరు - సికింద్రాబాద్ ఆర్‌ఆర్‌బీ స్పెషల్స్

గుంటూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్‌లో జరిగే ఆర్‌ఆర్‌బీ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థుల సౌకర్యార్థం అన్-రిజర్వుడ్ స్పెషల్ ట్రైన్స్‌ని నడప నున్నట్లు గుంటూరు డీఆర్‌ఎం ఎం.రామకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నంబరు. 07171 గుంటూరు - సికింద్రాబాద్ ఆర్‌ఆర్‌బీ స్పెషల్ ట్రైన్ ఈ నెల 24, 25, 26, 28, 29 తేదీల్లో ఉదయం 8 గంటలకు బయలుదేరి మంగళగిరి, విజయవాడ, కాజీపేట మార్గంలో ప్రయాణించి సాయంత్రం 4.15కి సికింద్రాబాద్ చేరుకుంటుంది. నంబరు. 07102 సికింద్రాబాద్ - గుంటూరు ఆర్‌ఆర్‌బీ స్పెషల్ ఈ నెల 24, 25, 26, 28, 29 తేదీల్లో సాయంత్రం 5.45కి బయలుదేరి అర్ధరాత్రి దాటాక 2 గంటలకు గుంటూరు చేరుకుంటుంది. ఆర్‌ఆర్‌బీ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు ఈ సదుపాయాన్ని వినియోగించు కోవాల్సిందిగా డీఆర్‌ఎం విజ్ఞప్తి చేశారు.

వాడవాడలా.. మద్యం

(5వ పేజీ తరువాయి)

బెల్ట్‌షాపులున్నాయి.

- పెదకాకాని మండలంలోని వెనిగండ్ల సుగాలికాలనీ, ఎరుకల కాలనీ, గోళ్లమూడి, తక్కెళ్లపాడు, ఉప్పలపాడు, వెంకటకృష్ణాపురం, కొప్పురావూరులో బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నారు.
- మంగళగిరిలోని బాప్టిసు పేట, పాతమంగళగిరి, కుప్పరావుకాలనీ, వీవర్స్ కాలనీతోపాటు మండల పరిధిలోని దాదాపు అన్ని గ్రామాల్లో ఎనీ టైం మద్యం లభిస్తోంది. తాడేపల్లి పరిధిలోని డోలాస్‌నగర్, ప్రకాష్‌నగర్, నులకపేటలో బెల్ట్ షాపులున్నాయి. సీతానగరం ఘాట్ల వద్ద నిత్యం ఓపెన్ బార్ నడుస్తుంది. ఇక్కడ తెల్లవారుజామున 4 గంటల నుంచే మందుబాబులు ఫుల్‌గా తాగి గొడవలు పడుతుంటారు.



బాపట్ల ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో అనధికారిక మద్యం బాటిళ్లతో పట్టుబడిన వ్యక్తి (ఫైల్ ఫొటో)

- తాడికొండ గ్రామంలో చింతచెట్టు సెంటర్, పడమర వీధి రామాలయం, రావిచెట్టు సెంటర్, ఎస్సీ కాలనీలో, పొన్నెకల్లు బైపాస్‌లో మూడు షాపుల్లో, సత్రం సెంటర్, జడలం బావి సెంటర్‌లో, లాం, నిడుముక్కల, మోతడక, పాములపాడు, బండారుపల్లిలో మద్యాన్ని విక్రయిస్తున్నారు.
- కాకుమాను మండలంలోని కొమ్మూరు, రేటూరు, అప్పాపురం, గరికపాడు, బీకేపాలెం, చిన్నలింగాయపాలెం గ్రామాల్లో బెల్టు షాపులు నడుస్తున్నాయి. ఇటీవల కొమ్మూరులో బెల్టు షాపులను తొలగించాలని ఎమ్మెల్యే రామాంజనేయులకు గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు.
- నరసరావుపేట నియోజకవర్గంలోని ఒకటి రెండు గ్రామాలు మినహా అన్ని పల్లెల్లో మద్యం బెల్టు షాపులు నిర్వహిస్తున్నారు. రొంపిచర్ల మండలంలో మద్యం షాపుల నిర్వాహకుల మధ్య పోటీ నెలకొనడంతో ఒక వర్గం అధికారం అండతో బెల్టు షాపులను గ్రామాల్లో నిర్వహిస్తోంది. వీరు తప్ప మరేవరు గ్రామాల్లో బెల్టు షాపులు నిర్వహించకూడదని బెదిరిస్తుంది. నరసరావుపేట మండలంలో వ్యాపారులు సిండికేటై బెల్ట్ షాపులను పెద్ద ఎత్తున ఏర్పాటు చేశారు.
- చిలకలూరిపేటలోని శివారు కాలనీలతో పాటు యడ్లపాడు మండలంలో ప్రతి గ్రామంలోనూ బెల్టు షాప్‌లు ఉన్నాయి. సాతులూరు వంటి గ్రామాల్లో ఏడు నుంచి పది బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నారు.
- పిడుగురాళ్ల, బ్రాహ్మణపల్లి, కరాలపాడు, గురజాల, మాచ వరం, మోర్జంపాడు, అంబాపురం, పులిపాడు, దైద, జంగమహేశ్వర పురంలో బెల్టుషాపులు కొనసాగుతున్నాయి. తెలంగాణ మద్యాన్ని కూడా కొందరు గుట్టుగా విక్రయిస్తున్నారు. కారంపూడిలో 3 మద్యం షాపుల నిర్వాహకులే పలు బడ్డీ బంకుల వద్ద మద్యం ఉంచి క్వార్టర్‌కు రూ.30 అదనంగా అమ్మిస్తున్నారు.
- రెంటచింతల మండలంలోని జెట్టిపాలెం, తుమృకోట గ్రామాల్లోని బెల్ట్‌షాపులపై కేసులు నమోదయ్యాయి. దుర్గి మండల పరిధిలో రెండు మద్యం దుకాణాలు ఉన్నాయి. కొన్ని గ్రామాల్లో యథేచ్ఛగా హైవే రోడ్డు పక్కన దాబాల్లో మద్యం విక్రయాలు సాగుతున్నాయి. కొందరు యువకులు మద్యం షాపుల్లో మద్యం కొనుగోలు చేసి నాగులేటి పరిసర ప్రాంతాల్లో అధిక ధరకు విక్రయిస్తున్నారు.
- బాపట్ల నియోజకవర్గ పరిధిలో ముత్తాయపాలెం, మద్దిబోయినవారిపాలెం, కనకాద్రి నగర్‌తో పాటు సూర్యలంక తీర ప్రాంతంలో అనధికార మద్యం అమ్మకాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. అద్దంకి, పర్చూరు నియోజకవర్గాల పరిధిలోని చాలా గ్రామాల్లో వైసీపీ హయాంలో ఎవరైతే బెల్టు షాపులు నిర్వహించారో వారే ఇప్పుడు కూడా బెల్టు దందాను నడుపుతున్నారు.
- చీరాలలో సుదీర్ఘకాలంగా మద్యం వ్యాపారంలో ఉన్న ఓ టీడీపీ ద్వితీయశ్రేణి నేత బెల్టు షాపుల సిండికేట్ విషయంలో ఎడతెగని చర్చలు జరుపుతున్నట్లు సమాచారం. ఇక్కడ టీడీపీకి చెందిన వారితో పాటు వైసీపీకి చెందిన వారు కూడా దాదాపు 7 షాపులు దక్కించుకున్నారు. వారిని కూడా ఈ బెల్టు సిండికేట్‌లో భాగస్వామ్యం అయ్యే విధంగా సదరు నేతే పావులు కదుపుతున్నట్లు తెలుస్తోంది.

14న జాతీయ లోక్ అదాలత్

గుంటూరు(లీగల్), నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాలోని అన్ని కోర్టు ప్రాంగణాల్లో డిసెంబరు 14న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించ నున్నట్లు జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఛైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి వైవీఎస్‌బీజీ పార్థ సారథి తెలిపారు. ఈ జాతీయ లోక్ అదాలత్ లో ఏర్పాటు చేయనున్న బెంచ్ ల ద్వారా జిల్లా వ్యాప్తంగా ఉన్న కోర్టులలో భాగ పంపిణీ దావాలు, బాకీ వసూలు కోసం వేసిన దావాలు, పర్మినెంట్ ఇంజక్షన్ దావాలు, ఆస్తి కొనుగోళ్ల అమ్మకాలకు సంబంధించి అగ్రిమెంట్‌లపై వేసిన దావాలతోపాటు ఇతర సివిల్ దావాలు, రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులు, ఎక్సైజ్ శాఖ నమోదు చేసిన కేసుల్లో రాజీ పడదగ్గ కేసులు, మోటార్ వాహన ప్రమాద బీమా కేసులు, చెక్ బౌన్స్ కేసులు, భూసేకరణకు సంబంధించి పరిహారం కేసులతోపాటు కోర్టుల్లో కాకుండా నేరుగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థలో దాఖలైన ప్రీ-లిటి గేషన్ కేసులు రాజీ మార్గంలో పరిష్కరించనున్నామని పార్థసారథి చెప్పారు.

'ఆర్గానిక్' మోసంపై కేసు

గుంటూరు సిటీ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆర్గానిక్ ఎరువుల పేరిట పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం రైతులను నిట్ట నిలువునా ముంచిన సంస్థపై చట్టపర మైన చర్యలకు వ్యవసాయ శాఖ సిద్ధమైంది. ఉత్తరప్రదేశ్‌కు చెందిన స్టార్ అగ్రి జెని టిక్స్‌పై పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు అధికారులు రంగం సిద్ధం చేశారు. సంస్థకు చెందిన ఎరువుల నమూనాలు విఫలం కావడంతో అధికారులు ఈ నిర్ణయం తీసు కున్నట్లు తెలుస్తోంది. సెప్టెంబరు 10 వ తేదీన గుంటూరు నగరంలోని ఏటుకూరు రోడ్డులో ఉన్న వీఆర్ ఎల్ పార్సిల్లో వ్యవసాయ అధికారులు రూ. 13.68 లక్షల విలువ చేసే 6వేల కిలోల బరువు కలిగిన ఆర్గానిక్ ఎరువులను స్వాధీనం చేసుకున్న విషయం విదితమే. ఉత్తరప్రదేశ్‌లోని స్టార్ అగ్రి జెనిటిక్స్ సంస్థ ఆర్గానిక్ ఎరువులను పశ్చిమగోదావరి జిల్లాలోని తాడేపల్లి గూడెం తరలిస్తుండగా పార్సిల్ కార్యాలయంలో తనిఖీ చేపట్టిన ఇక్కడి వ్యవ సాయ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఎరువుల నమూ నాలను సేకరించిన అధి కారులు పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపారు. ల్యాబ్‌కు వెళ్లిన ఆరు నమూనాలు విఫల మైనట్లు తెలుస్తోంది. ఉప్పు స్వభావం కలిగిన ముడి పదా ర్థానికి రంగు వేసి ఎరు వుగా చెలామణి చేస్తున్నట్లు పరీక్షల్లో తేలింది. ల్యాబ్ రిపోర్ట్ ఆధారంగా అధికారులు ఉత్తర ప్రదేశ్‌లోని స్టార్ అగ్రి జెనిటిక్స్ సంస్థపై పోలీసు కేసు నమోదు చేయించేందుకు సిద్ధ మయ్యారు. పోలీసు విచారణలో సంస్థ అసలు రంగు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.80
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	107,115,126
చికెన్ విత్ స్కిన్	204.00
చికెన్ స్కిన్ లెస్	214.00

పంచాయతీ రాజ్ డీఈఈ పెన్షన్ నిలిపివేత

గుంటూరు సిటీ, నవంబర్ 21 (ఆంధ్రజ్యోతి): గతంలో పల్నాడు జిల్లా రాజుపాలెం పంచాయతీ రాజ్ సబ్ డివిజనల్ డీఈఈగా పనిచేసిన ఎన్ వెంక టేశ్వరరెడ్డి పెన్షన్, గ్రాట్యుటీ చెల్లింపు పూర్తిగా నిలిపివేస్తూ ఆ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషన్ కుమార్ ఉత్తర్వులు వెలువరించారు. వెంకటేశ్వరరెడ్డి 2009 రాజుపాలెంలో పని చేస్తున్న సమయంలో లంచం తీసుకుంటూ ఏసీబీ కి పట్టుబడ్డారు. ఆరోపణలు రుజువు కావడంతో పెన్షన్, గ్రాట్యుటీ 100 శాతం నిలిపివేస్తూ నిర్ణయం తీసుకుంది.

44,282 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు గురువారం 46,017 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 44,282 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నత శ్రేణి కార్యదర్శి వినుకొండ ఆంజనేయులు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 37,373 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరప కాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఏసీ కామన్ వెరైటీ		
334	7500	14500	334	9000	13500
నెంబరు. 5	8000	11000	నెంబరు. 5	8000	11500
273	8000	12000	273	-	-
341	8000	15000	341	9000	14000
4884	-	-	4884	10000	11800
సూపర్ 10	-	-	సూపర్ 10	-	-
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	7500	16500	తేజ	7500	16500
బ్యాడిగి	7500	13800	బ్యాడిగి	8000	12500
దేవనూరు డీలక్స్	8500	14000	దేవనూరు డీలక్స్	11500	14500
తెల్లకాయలు	4500	11000	తెల్లకాయలు	5000	10000

గుర్తుతెలియని వ్యక్తి మృతి

ప్రత్తిపాడు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిని దాటుతుండగా లారీ ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మరణించిన సంఘటన మండల పరిధిలోని యనమదల వద్ద గురువారం జరిగింది. ప్రత్తిపాడు పోలీసుల వివరాల ప్రకారం సుమారు 40 సంవత్సరాల వయసు ఉన్న గుర్తుతెలియని వ్యక్తి జాతీయ రహదారి దాటుతుండగా గుంటూరు నుంచి చిలకలూరిపేట వైపు వెళ్తున్న లారీ వేగంగా వస్తూ ఢీకొట్టింది. అతను అక్కడికక్కడే మరణించాడు. ప్రత్తిపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు బయోడైవర్సిటీ బోర్డు ఛైర్మన్ ప్రమాణస్వీకారం

అమరావతి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బయోడైవర్సిటీ బోర్డు ఛైర్మన్‌గా శుక్రవారం ఉదయం 11.30 గంటలకు ప్రమాణస్వీకారం చేయనున్నట్లు టీడీపీ నేత నీలాయపాలెం విజయ్‌కుమార్ తెలిపారు. గుంటూరు సమీపంలోని నాగార్జున వర్సిటీ వద్ద రెయిన్‌ట్రీ పార్క్‌లోని బోర్డు కార్యాలయంలో ఈ కార్యక్రమం జరగనుంది.

బాలుడు మృతిపై జడ్జి విచారణ

తాడికొండ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పొన్నెకల్లు జడ్పీ పాఠశాలలో తొమ్మిదో తర గతి చదువుతున్న షేక్ సమీర్ మృతిపై డిస్ట్రిక్ లీగల్ సర్వీస్ అథారిటీ సెక్రటరీ టి.లీలావతి గురువారం విచారణ జరిపారు. పాఠశాలలోని విద్యార్థులు, ఉపాధ్యాయులను విచా రించారు. బాలుడు మృతి చెందిన నేలబావిని పరిశీలించారు. సమీర్ గత అక్టోబర్ 24న నేలబావిలో మృతి చెందిన సంఘటన తెలిసిందే. బాలుడు మృతి చెందిన రోజు బంధువులు ఫిర్యాదు చేయకపోవటంతోపాటు, పోస్టుమార్టం చేయటానికి మృతదేహాన్ని జీజీ హెచ్‌కి తరలించడాన్ని కూడా అడ్డుకున్నారు. దీంతో సమీర్ మృతదేహాన్ని సొంత గ్రామం కర్లపూడికి తీసుకువెళ్లి అంత్యక్రియలు నిర్వహించారు. అయితే సమీర్ మృతిపై అనుమానాలు ఉండటంతో కలెక్టర్‌కు ఫిర్యాదులు అందాయి. దీంతో విద్యాశాఖ అధికారులు విచారణ చేపట్టారు. బాలుడు బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేయటంతో మంగళవారం బాలుడి మృత దేహాన్ని వెలికితీసి వైద్యులు పోస్టుమార్టం నిర్వహించారు.

రైలు పట్టాలపై యువతి బలవన్మరణం

దాచేపల్లి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): దాచేపల్లి నగర పంచాయితీ నారాయణపురంలో నివాసముంటున్న గొల్ల మందల అంజలి (21) నడికూడి రైల్వేస్టేషన్ సమీపంలోని రైలు పట్టాలకు దగ్గరలో ఒంటిపై పెట్రోలు పోసుకొని మృతి చెందినట్లు దాచేపల్లి ఎస్‌ఐ పాపారావు గురువారం తెలిపారు. అంజలి వ్యక్తిగత కారణాలతో బలవన్మరణానికి పాల్పడినట్లు పోలీసులు వివరించారు. దాచేపల్లి ఎస్‌ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతురాలికి వివాహం కాలేదు. నారాయణ పురంలో నివాసముంటున్న శేషమ్మ మనుమరాలుగా గుర్తించారు.

నేడు కేంద్ర సహాయ మంత్రి సమీక్ష

గుంటూరు సిటీ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు సీసీఐ పత్తి కొనుగోళ్లు ఊపందుకున్నాయి. కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ చూపిన చొరవ పత్తి రైతుకు ఊతమిస్తోంది. గుంటూరు, పల్నాడు, ఎన్టీఆర్ జిల్లాల్లోని సీసీఐ కేంద్రాల్లో గత రెండు రోజులుగా చెప్పుకోదగ్గ స్థాయిలో పత్తి కొనుగోలు జరిగినట్లు అధికారులు వెల్లడించారు. గుంటూరు సీసీఐ కేంద్రాల్లో గత ఏడాది ఈ సమయానికి 20,850 క్వింటాళ్ల పత్తి కొనుగోలు చేయగా, ఈ ఏడాది 20416 క్వింటాళ్ల కొనుగోలు చేశారు.పల్నాడు జిల్లాలో గత ఏడాది ఈ సమయానికి 12,078 క్వింటాళ్ల పత్తి కొనుగోలు చేయగా,ఈ ఏడాది ఇప్పటికి 26,288 క్వింటాళ్లల కొనుగోలు చేశారు.ఇదిలా ఉండగా, పత్తి కొనుగోళ్లపై కలెక్టర్ కార్యాలయంలో పెమ్మసాని శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించ నున్నారు. కేంద్ర మంత్రి ఫిర్యాదుతో రాష్ట్రానికి వచ్చిన సీసీఐ మార్కెటింగ్ డైరెక్టర్ విజయ్ కురదగీ గురువారం కూడా పలు కేంద్రాల్లో తనిఖీ చేశారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

గుంటూరు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): విద్యుత్‌లైన్‌ల నిర్వహణలో భాగంగా శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డిప్యూటీ ఈఈ గురవయ్య ఒక ప్రకటనలో తెలిపారు. డీ8 సెక్షన్ పరిధిలోని కృష్ణనగర్ ఒకటో లైను, పట్టాభిపురం మెయిన్ రోడ్డు, జార్జిపేట ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. విద్యుత్ అంత రాయానికి ప్రజలు సహకరించాలని కోరారు.

కులాల వారీగా జనాభా లెక్కలు తేల్చాలి

గుంటూరు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): విద్యా,ఉద్యోగ,రాజకీయ, వ్యాపార రంగాల్లో బీసీలకు జరుగుతున్న అన్యాయాన్ని సరిదిద్దాలంటే కులాల వారి జనాభా లెక్కలు తేల్చాలని బీసీ కులాల సమన్వయ కమిటీ రాష్ట్ర చైర్మన్ అంగడాల పూర్ణచంద్రరావు డిమాండ్ చేశారు. గుంటూరు జిల్లా బీసీ కులాల సమన్వయ కమిటీ సమావేశం స్థానిక అరండల్‌పేటలోని విశ్వ బ్రాహ్మణ కళ్యాణ మండపంలో జరిగింది. ఈ సందర్భంగా జిల్లా బీసీ కులాల సమన్వయ కమిటీని ఎన్నుకున్నారు. 15 కులాలకు చెందిన ఒక్కొకరిని కో కన్వీనర్లుగా ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం జిల్లా చైర్మన్ కోటేశ్వరరావు మాట్లాడారు. సమగ్ర కుల గణనపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉదాసీనతతో వ్యవహరిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

గుంటూరు సీజీఎస్‌టీ ఆడిట్ పెర్ఫార్మెన్స్‌కు ఫస్ట్ గ్రేడ్


గుంటూరు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): దేశంలోని 48 సిజిఎస్‌టి ఆడిట్ కమిషనరేట్‌లలో గుంటూరు సిజిఎస్ టి ఆడిట్ కమిషనరేట్‌కు యాన్యువల్ కంపోజిట్ గ్రేడింగ్ లో 2023-24 ఆర్థిక ఏడాదికి ప్రథమ స్థానం దక్కింది. ఈ మేరకు ఢిల్లీలోని సీజీఎస్‌టీ ఆడిట్ డైరెక్టరేట్ జనరల్ కార్యాలయం విధి నిర్వహణలో ప్రతిభ కనబరచిన సిజిఎస్‌టి ఆడిట్ కార్యాలయాల గ్రేడింగ్ లిస్ట్ ను గురు వారం విడుదల చేసింది. అందులో గుంటూరు సిజిఎస్‌టి ఆడిట్ కార్యాలయం ఫస్ట్ గ్రేడ్ ను సొంతం చేసుకుంది. 100 మార్కులలో గుం టూరు సీజీఎస్‌టీ ఆడిట్ కమిషనరేట్ అత్య. ధికంగా 73.22 మార్కులు సాధించగా, అత్య ల్పంగా కోల్‌కతాలోని దుర్గాపూర్ ఆడిట్ కమిషనరేట్ కు 49.43 మార్కులు దక్కాయి. ఈ సందర్భంగా 2023-24 ఆర్థిక సంవత్సరంలో గుంటూరు ఆడిట్ లో పనిచేసిన అధికారులకు ఆ శాఖ చీఫ్ కమిషనర్ సంజయ్ రాఠీ, కమిషనర్ పి ఆనంద్‌కుమార్ అభినందనలు తెలిపారు.

'ఆపరేషన్ రెడ్ లైట్ ఏరియా' రామిరెడ్డితోటలో వ్యభిచారం పై నిఘా


ఈస్ట్ డీఎస్పీ కు వినతి పత్రం అందిస్తున్న మీరావలి, సాబీరా దంపతులు


గుంటూరు, నవంబర్ 21 (ఆంధ్రజ్యోతి) : ఆపరేషన్ రెడ్ లైట్ ఏరియా'కు కొత్తపేట పోలీసులు శ్రీకారం చుట్టారు. ప్రధానంగా కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలో వ్యభిచార కార్యకలాపాలను పూర్తిగా కట్టడి చేసేందుకు చర్యలు ప్రారంభించారు. ముఖ్యంగా రామిరెడ్డి తోటలో రైల్వే ట్రాక్ వెంబడి ఎన్నో దశా బ్దాలుగా వ్యభిచార గృహాలు ఉన్నాయి. ఈ నేప థ్యంలో రామిరెడ్డి తోటలోని రైల్వే ట్రాక్ వెంబడి వ్యభిచార గృహాల్లో కార్యకలాపాలను పూర్తిగా నియంత్రించి సాధారణ స్థితి తీసుకు రావాలని స్థానికులు కోరుతున్నారు. ఈ మేరకు గత సోమవారం రామిరెడ్డితోట ప్రాంతానికి చెందిన షేక్ మీరావలి, సాబీరా దంపతులు ఎస్పీ కార్యాలయాన్ని ఆశ్రయించి అక్కడ పరిస్థితు లను వివరించారు. గురువారం ఈస్ట్ డీఎస్పీ అబ్దుల్ అజీజ్ ను కలసి వినతిపత్రం అందించారు. రామిరెడ్డితోట, కొత్తపేట లాడ్జిలలో వ్యభి చార కార్యకలాపాలకు పోలీసులు చెక్ పెట్టనున్నారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి


మృతుడు నాగుల్ మీరా

గుంటూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక లాలాపేట పోలీస్‌స్టేషన్ పరిధి లోని చాకలిగుంట శ్మశాన వాటిక వద్ద కాలువలో పడి తాపీ పని కార్మికుడు షేక్ నాగుల్ మీరా (39) అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. నల్లచెరువు 6వ లైన్ కు చెందిన షేక్ నాగుల్ మీరా తాపీ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. నాగుల్ మీరాకు మద్యం తాగే అలవాటు ఉందని, సుమారు నాలుగేళ్ల నుండి ఫిట్స్ వ్యాధితో బాధ పడుతున్నాడని భార్య షేక్ ముబీనా తెలిపారు. అయితే 20వ తేదీ ఉదయం ఏడు గంటల సమయంలో పని కోసం బయటికి వెళ్లి ఇంటికి రాలేదని, సుమారు రాత్రి 10:00 గంటల సమయంలో తన భర్త నాగుల్ మీరా చాకలి గుంట శ్మశానం దగ్గర గల మురుగు కాలువ లో పడిపోయి ఉన్నాడని తెలిసిందన్నారు. వెంటనే అక్కడికి వెళ్లి చూడగా చనిపోయి ఉన్నాడని. తన భర్త అధికంగా మద్యం తాగడం వల్ల కానీ ఫిట్స్ రావడం వల్ల గాని మురుగు కాలువలో పడి చనిపోయి ఉంటాడని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని యువకుడు అనుమానాస్పద మృతి



గుంటూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : జీజీ హెచ్ ఔట్ పోస్టు వద్ద గుర్తుతెలియని యువ కుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. సుమారు 25 సంవత్సరాల వయసు కలిగిన గుర్తుతెలియని యువకుడు గురువారం సాయంత్రం సుమారు 4.30 గంటలకు జీజీహెచ్ ఔట్‌పోస్టు వెనుక గల ఆటో స్టాండ్ వద్ద ఉన్న రోడ్డు మార్జిన్‌లో చని పోయి పడి ఉన్నాడు. అక్కడ ఆటో స్టాండ్ వారు కొత్తపేట పోలీసులకు ఈ మేరకు సమా చారం ఇచ్చారు. కొత్తపేట ఏఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి సంఘటనా స్థలానికి వెళ్లి మృతుడి ఆచూకీ గురించి చుట్టుపక్కల వారిని విచారించి నప్పటికీ మృతుని ఆచూకీ తెలియరాలేదు. మృతదేహాన్ని మార్చురీలో భద్రపరిచారు. మృతుని ఆచూకీ తెలిసిన వారు కొత్తపేట సీఐకి 8688831320లో తెలియజేయాలని పోలీసులు కోరారు.

'దీపం-2' తో 1.84 లక్షల మందికి లబ్ధి

● లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోకి రూ. 11.43 కోట్లు జమ



గుంటూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): దీపం-2 వంట గ్యాస్ సబ్సిడీ పథకాన్ని జిల్లా వ్యాప్తంగా అర్హులైన వినియోగదారులు పెద్ద సంఖ్యలో వినియోగించు కుంటున్నారు. ఈ పథకం అమలులోకి వచ్చిన మూడు వారాల్లోనే జిల్లాలో లక్షా 84 వేల మంది లబ్ది పొందారు. వంట గ్యాస్ రీఫిల్ సిలిండర్ పూర్తి సబ్సిడీని వారి బ్యాంకు ఖాతాల్లోకి ప్రభుత్వం జమ చేసేసింది. ఎంతమంది అర్హులుంటే వారందరికి సబ్సిడీని మంజూరు చేసేందుకు ఇంధన సంస్థలకు ప్రభుత్వం నిధులు విడుదల చేసిన దృష్ట్యా చెల్లింపులకు ఎక్కడా ఎలాంటి ఇబ్బంది తలెత్తడం లేదు. అయితే, కొంతమంది అర్హులు తమకు ఎందుకు సబ్సిడీ జమ కావడం లేదని జిల్లా పౌరసరఫరాల అధికారి కార్యాలయానికి వచ్చి వాకబు చేస్తున్నారు. వినియోగదారుల ఫిర్యాదులపై పౌరసరఫరాల అధికారులు వెంటనే స్పందించి అందుకు గల కారణాలను వివరిస్తున్నారు. జిల్లాలో హెచ్‌పీసీఎల్‌కు 4,36,956, ఐవోసీకి 1,59,136, బీపీసీకి 1,69,801 వంట గ్యాస్ కనెక్షన్‌ల వినియోగదారులు ఉన్నారు. వీరిలో ఎవరికైతే తెల్లకార్డు ఉందో వారికే ప్రభుత్వం దీపం-2 కింద వంటగ్యాస్ సబ్సిడీని ఏడాదిలో మూడు సార్లు జమ చేసేం దుకు శ్రీకారం చుట్టింది. గురువారం సాయంత్రం వరకు 1,83,949 మంది లబ్ధిదారులు వంటగ్యాస్ సబ్సిడీని పొందారు. వారిలో 1,41,444 మందికి రూ. 11 కోట్ల 43 లక్షల 11 వేల 835 నగదు బ్యాంకు ఖాతాల్లోకి జమ చేశారు. అయితే, చాలామంది తమకు సబ్సిడీ రాలేదని కలెక్టరేట్‌లోని పౌరసరఫరాల శాఖ అధికారి కార్యాలయానికి వస్తున్నారు.

వంటగ్యాస్ సబ్సిడీ పథకానికి అర్హులు కావాలంటే కచ్చితంగా సిక్స్ స్టెప్ వ్యాలిడేషన్‌లో అర్హత సాధించాల్సిందే. ఈ పథకానికి అర్హులు ఎవరనేది తెలుసుకొనే వెబ్‌లింక్‌ని రాష్ట్ర ప్రభుత్వం పౌరసరఫరాల జిల్లా శాఖలకు పంపించింది. ఆ లింక్ ప్రస్తుతం జిల్లా సరఫరాల అధికారి నియంత్రణలో ఉన్నది. ఎవరికైనా సబ్సిడీ పడకపోతే డీఎస్‌వో వద్దకు వెళ్లి రైస్‌కార్డు నంబరు చెబితే తొలుత అర్హులో, కాదో చెబుతున్నారు. ఒకవేళ అనర్హులైతే ఏ కారణం చేతనో కూడా పేర్కొంటున్నారు. అర్హులై ఉండి సబ్సిడీ నగదు జమ కాలే దంటే అందుకు గల సాంకేతిక కారణాలను వివరించి సరి చేసుకోమంటున్నారు. గతంలో కొంతమంది అనర్హులై ఉండి కూడా వైసీపీ నేతలను, అధికారులను ప్రసన్నం చేసుకొని తెల్లరంగు రేషన్‌కార్డు, ఆరోగ్యశ్రీ కార్డు, పింఛన్ తీసేయకుండా జాగ్రత్తపడ్డారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం సిక్స్‌స్టెప్ వాలిడేషన్‌తో పాటు మరికొన్ని సాఫ్ట్‌వేర్‌లను కూడా రన్ చేసి అనర్హులను వడ పోసింది. ఈ కారణంగానే రేషన్ కార్డు ఉన్నా, సామాజిక పింఛన్ పొందుతున్నా వారు దీపం-2 కింద వంట గ్యాస్ సబ్సిడీ పొందడానికి అనర్హులౌతున్నారు. ఎవరికైతే సిక్స్‌స్టెప్ వాలిడేషన్‌లో ఎలాంటి రిమార్కులు లేవో వారందరికి సబ్సిడీ జమ అవుతోంది. అలానే కొందరి బ్యాంకు అకౌంట్‌లు ఎన్‌పీసీఐతో లింక్ అయి లేవు. దీంతో వారికి కూడా సబ్సిడీ జమ కావడం లేదు. అలాంటి వారందరూ బ్యాంకులకు వెళ్లి ఎన్‌పీసీఐకి లింక్ చేయించుకోవాలని సూచిస్తున్నారు. వీరికి సౌలభ్యం కోసం ఎన్‌పీసీఐతో లింక్ చేసే పోస్టల్ అకౌంట్లను సచివాలయాల్లోనే తెరుస్తున్నారు.

తాగునీటి రిజర్వాయర్లను ప్రతినెలా శుభ్రం చేయాలి

● జీఎంసీ కమిషనర్


ఏటీ అగ్రహారంలో రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని తాగు నీటి రిజర్వాయర్లను ప్రతి నెలా శుభ్రం చేయాలని జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో గురు వారం తాగునీటి సరఫరా, రిజర్వాయర్ల శుభ్రం, రోడ్ల విస్తరణ తదితర అంశాలపై ఇంజి నీరింగ్, పట్టణ ప్రణాళిక అధికారులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఎమినిటి కార్యదర్శులు ప్రతిరోజు తాగునీటి సరఫరా జరిగే సమయంలో 10 ప్రాంతాల్లో క్లోరిన్ శ్యాంపిల్స్ తీయాలని ఆదేశించారు. తాగునీటి రిజర్వాయర్ల శుభ్రతపై పలు ఫిర్యా దులు అందుతున్నాయని, ప్రతి నెల నిర్దేశిత షెడ్యూల్ మేరకు శుభ్రం చేయాలని ఏఈలను ఆదేశించారు. రిజర్వాయర్లు శుభ్రం చేసే సమయంలో ట్యాక్స్ పేయర్స్ అసోసియేషన్ ప్రతినిధులకు కూడా సమాచారం అందించాలన్నారు. రిజర్వాయర్ల పటిష్టతపై నివేదిక కోసం సిద్ధార్థ ఇంజనీరింగ్ కాలేజీకి లేఖ సిద్ధం చేయాలని ఎస్ఈని ఆదేశించారు. ప్రతి రిజర్వాయర్‌కి పైన కప్పులు ఉండాలని, ఏమైనా మర మ్మతులు ఉంటే తక్షణం చేపట్టాలని, తమ క్షేత్ర స్థాయి పర్యటనల్లో నేరుగా తనిఖీ చేస్తా మని తెలిపారు. రోడ్ల విస్తరణపై సమీక్షించారు. ఏటీ అగ్రహారం రోడ్డు విస్తరణ పనుల జాప్యం వలన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఆయా పనులను శుక్రవారం నుండి పునః ప్రారంభించాలని ఇంజి నీరింగ్ అధికారులకు, కాంట్రాక్టర్లకు స్పష్టం చేశారు. రెడ్డిపాలెం రోడ్డులో డ్రెయిన్ కాంట్రాక్టర్ నిర్మాణ పనులకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. ట్యాక్స్ పేయర్స్ అసోసియేషన్ అధ్యక్షులు నారాయణరెడ్డి మాట్లాడుతూ నగర ప్రజలకు మెరుగైన త్రాగునీటిని అందించేందుకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. సమా వేశంలో ఎస్ఈ నాగ మల్లేశ్వరరావు, సిటీ ప్లానర్ రాంబాబు, డిసిపి సూరజ్ కుమార్, ఈఈలు సుందర్రామిరెడ్డి, కోటేశ్వరరావు పాల్గొన్నారు.


బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్‌కు షోకాజు నోటీస్

గడువు సమయం మించి ఫైల్ పరిష్కారం చేయకపోవడంపై పట్టణ ప్రణాళిక టీపీఎస్ సత్యనారాయణకు షోకాజ్ నోటీసు జారీ చేశారు. ఈ సందర్భంగా జీఎంసీ కమిషనర్ మాట్లాడుతూ ప్రభుత్వసేవలను నిర్దేశిత ప్రభుత్వ గడువు మేరకు పరిష్కారం చేయాలని, కొందరు అధికారులు నిర్లక్ష్యంగా ఉంటున్నారన్నారు. టీపీఎస్ సత్యనారా యణ డీపీఎంఎస్ లో ఓ భవనానికి సంబంధించిన ఫైల్ 25 రోజుల పాటు తన లాగిన్ లో ఉంచడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేసి షోకాజ్ నోటీసు జారీ చేయాలని సిటి ప్లానర్‌ని ఆదేశించారు. నేషనల్ పేమెంట్స్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ)సర్వే, ఇళ్ల జియో ట్యాగింగ్ వేగవంతంపై మౌఖికంగాను, టెలి కాన్ఫరెన్స్ ద్వారాను ఆదేశించినా ఆశించిన స్థాయిలో ఆయా నోడల్ అధికారుల పరిధిలో సర్వే వేగవంతం కాలేదన్నారు. ఎన్‌పీసీఐ సర్వేకి సంబంధించి, హౌసింగ్ జియో ట్యాగ్ కి సంబంధించి ఎవరికైతే షోకాజ్ నోటీసులు జారీ చేశారో వారి పేర్లను తెలిపారు.

తారకరామనగర్ రోడ్డును 60 అడుగులకు విస్తరించాలి

స్థానిక తారకరామనగర్ రోడ్డుని మాస్టర్ ప్లాన్ మేరకు 60 అడుగుల విస్తరణకు చర్యలు తీసు కోవాలని, తొలుత డొంక ఫిక్స్ చేసి ఆక్రమణదారులకు నోటీసులు ఇవ్వాలని జీఎంసీ కమిషనర్ పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. గురువారం కమిషనర్ తారకరామనగర్‌లో ప్రతిపాదిత విస్తరణ రోడ్డు, నాయిబ్రాహ్మణ కాలనీ, ఏటీ అగ్రహారం, రెడ్డి పాలెం, మంగళదాస్‌నగర్ తదితర ప్రాంతాల్లో పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్, ప్రజారోగ్య శాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ తారకరామనగర్ మెయిన్ రోడ్డు విస్తరణపై ఇప్పటికే ప్రజా ప్రతినిధులు, స్థానికులు పలు అర్జీలు ఇచ్చారన్నారు. పట్టణ ప్రణాళిక అధికారులు తొలుత డొంకని ఫిక్స్ చేసి ఆక్రమణ దారులకు నోటీసులు ఇవ్వాలన్నారు. నోటీసుల గడువు అనంతరం ఆక్ర మణల తొలగొంపు చేపట్టి మాస్టర్ ప్లాన్ ప్రకారం 60 అడుగులకు విస్తరణ చేస్తామన్నారు. ఏటి అగ్రహారం రిజర్వాయర్, పంప్ హౌస్‌ని పరిశీలించారు. నాయిబ్రాహ్మణ కాలని, రెడ్డిపాలెంలో నూతన సీసీ రోడ్లను పరిశీలించారు. మంగళదాస్‌నగర్‌లో అసంపూర్తిగా ఉన్న కమ్యూనిటి హాల్ నిర్మాణానికి సమగ్ర అంచనాలు సిద్ధం చేయాలన్నారు.

పల్లె పండుగ పనులు రెండు రోజుల్లో ప్రారంభించాలి


సమీక్ష నిర్వహిస్తున్న డ్వామా పీడీ శంకర్

గుంటూరు సిటీ,నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లాలో పల్లె పండుగ లో గుర్తించి, తీర్మానించిన పనులను రానున్న రెండు రోజుల్లో ప్రారంభించాలని డ్వామా పీడీ శంకర్ ఆదేశించారు. స్థానిక అటవీశాఖ కార్యాలయంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలు తీరుపై జిల్లాలోని మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, ఏపీఓలు,పీఓలు, ఇతర మండల స్థాయి అధికారులతో గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. డ్వామా పీడీ మాట్లాడుతూగ్రామ సభలలో తీర్మానించిన పనులను ప్రభుత్వము నిర్దేశించిన సమయంలో పూర్తి చేయాలన్నారు. పనులను గుర్తించేటప్పుడు శాశ్వత ఆస్తుల కల్పనకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. పల్లె పండుగ కార్యక్రమంలో చేపట్టి, మంజూరు చేసిన సీసీ రోడ్లు, క్యాటిల్ షెడ్లు, ఫారం పాండ్లు, సోక్ పిట్లు, రూఫ్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్లు వంటి పనులను రాబోయే రెండు రోజులలో ఖచ్చితంగా నిర్మాణం ప్రారంభించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా మండల పరిషత్ అభివృద్ధి అధికారులకు ఎన్ఐసీ సాఫ్ట్ వేర్ వినియోగం గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ ముఖ్య కార్య నిర్వహణాధికారి వి.జ్యోతిబసు, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ పోతురాజు, ఏపీడీ శివన్నారాయణ, క్వాలిటీ కంట్రోల్ అఫీసర్ శాంతారావు, జిల్లా విజిలెన్స్ అధికారి సి.హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

1 నుంచి విద్యార్థులకు టాలెంట్ షో కాంపిటీషన్స్

గుంటూరు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): గుంటూరు సొసైటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు, యువతకు పలు రకాల పోటీలతో గుంటూరు గాట్ టాలెంట్ షో కాంపిటీషన్స్ నిర్వహించనున్నట్లు సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షురాలు డాక్టర్ షామా సుల్తానా తెలిపారు. పొన్నూరు రోడ్డులోని ఓ కన్వెన్షన్ హాలో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో డాక్టర్ షామా సుల్తానా మాట్లాడారు. సింగింగ్, డాన్స్ స్టాండ్ అప్ కామెడీ, మ్యాజిక్ షో, మ్యూజికల్ ఇంస్ట్రుమెంట్స్‌ఫ్యాషన్ షో, మెహందీ, పోయెట్రీ, ఫన్నీ ఆర్ మెసేజ్ ఓరియెంటెడ్ స్కిట్ వంటి పోటీలను పొన్నూరు రోడ్డు ఆంధ్ర ముస్లిం కాలేజ్ సమీపంలో ఉన్న ఎమ్ కన్వెన్షన్ హాల్‌లో డిసెంబర్ 1, 8న పోటీలు, 15 న సెమీ ఫైనల్స్, 22 న ఫైనల్స్ ఉంటాయన్నారు. పోటీల్లో పాల్గొనే వారు 7780747616, 8886466233 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

30న శ్రీ వెంకటేశ్వర స్వామి వారికి గళార్చన

గుంటూరు(తూర్పు), నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ఈనెల 30న స్థానిక పాటిబండ్ల సీతారామయ్య హైస్కూల్ ప్రాంగణంలో శ్రీ వెంకటేశ్వర స్వామికి గళార్చనతో నీరాజనం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తానా అధ్యక్షుడు శృంగవరపు నిరంజన్ తెలిపారు. పాటిబండ్ల సీతారామయ్య పాఠశాల ఆవరణలో గురువారం వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు.

సమగ్రాభివృద్ధి కూటమితోనే సాధ్యం: ఎమ్మెల్యే మాధవి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే

గుంటూరు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమగ్ర అభివృద్ధి ఎన్డీయే కూటమితోనే సాధ్యమని, అందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్లా మాధవి తెలిపారు. అసెంబ్లీ సమావేశాలకు హాజరైన అనంతరం గురువారం ఆమె మీడియాతో మాట్లాడారు. కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించడం హర్షణీయమన్నారు. గత వైసీపీ ప్రభుత్వం 3 రాజధానుల పేరిట ప్రజల మధ్య చిచ్చు పెట్టిందని, తమది చేతల ప్రభుత్వమని, అన్ని ప్రాంతాలను సమంగా అభివృద్ధి చేయటానికి తమ నాయకుడు చంద్రబాబు ప్రణాళికలు రూపొందిస్తున్నారని తెలిపారు. హైకోర్ట్ బెంచ్ ఏర్పాటుకు తాము ఏకగ్రీవంగా మద్దతు తెలిపామన్నారు. ఎలక్ట్రానిక్స్- డేటా సెంటర్ పాలసీ తీసుకొని రావడంతో ఆంధ్రప్రదేశ్‌లో సాంకేతిక విప్లవానికి నాంది పలికిందని, అది నారా లోకేశ్ కృషితోనే సాధ్యమైందని చెప్పారు. కర్నూలులో డ్రోన్ పరిశ్రమ, విశాఖలో వైద్య పరికరాల పరిశ్రమ విశాఖపట్నంలో ఏర్పాటు చేసి, రాబోయే ఐదేళ్లలో 5 లక్షల మందికి ఉపాధి కల్పించబోతున్నామని లోకేశ్ ప్రకటించడం హర్షణీయమని ఎమ్మెల్యే అన్నారు.

చెత్తపన్ను రద్దుతో భారం తగ్గించాం: ఎమ్మెల్యే నసీర్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే

గుంటూరు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): చెత్తపన్ను రద్దు చేసి ప్రజలపై భారాన్ని కూటమి ప్రభుత్వం తగ్గించిందని గుంటూరు తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే మొహ మ్మద్ నసీర్ చెప్పారు. గుంటూరులో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ గత ప్రభుత్వం చెత్త సేకరణకు పన్ను విధించి సామాన్యులపై భారం మోపిందన్నారు. రాష్ట్రంలోని 40 మున్సిపాలిటీల పరిధిలో పన్ను వసూలు చేసిందని తెలిపారు. చెత్త సేకరణకు ప్రజలు నెలకు రూ.51,641 నుంచి రూ.62,964 వరకూ, నివాస గృహాల నుంచి నెలకు రూ.30 నుంచి 120 వరకు , కమర్షియల్ కాంప్లెక్స్‌ల నుంచి రూ.100 నుంచి రూ.10 వేల వరకు వసూలు చేశారని అన్నారు. పన్ను చెల్లించలేదని తాగునీటి సరఫరా ఆపే శారని, చాలా చోట్ల షాపులు, ఇళ్ల ముందు ఊర్లో సేకరించిన చెత్తను డంప్ చేసి తీవ్ర ఇబ్బందులకు గురిచేసిన ఘటనలు అనేకం చూశామని చెప్పారు. చెత్తపన్ను తొలగిస్తా మని ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మాట నిలబెట్టుకుంటున్నామని అన్నారు.

ఏలూరి బ్యాంక్ గోరంట్ల శాఖ ప్రారంభం


ఏలూరి బ్యాంకు గోరంట్ల శాఖను ప్రారంభిస్తున్న మంత్రి టీజీ భరత్ తదితరులు

గుంటూరు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): రెండున్నర దశాబ్దాలుగా కో ఆపరేటివ్ బ్యాంకింగ్ రంగంలో గుంటూరు జిల్లాలో అప్రతిహతంగా కొనసాగడం ఎన్‌పీలు లేకుండా బ్యాంకును నడపటం అభినందనీయమని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఆహార మంత్రిత్వశాఖ మంత్రి టీజీ భరత్ తెలిపారు. ఏలూరి బ్యాంకు గోరంట్ల శాఖను గురువారం పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవితో కలిసి మంత్రి ప్రారంభించారు. అనంతరం మంత్రి భరత్ మాట్లాడుతూ ఏలూరి గురవయ్య బ్యాంకును సమర్థవంతంగా నడపటం స్ఫూర్తిదాయకమన్నారు. బ్యాంకు సిల్వర్ జూబ్లీ జరుపుకోవడానికి సిద్ధమవుతున్న సమయంలో అధునాతన సదుపాయాలతో గోరంట్ల బ్రాంచ్‌కార్యాలయాన్ని ప్రారంభించడం హర్షణీయమన్నారు. పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి మాట్లాడుతూ రాజధానికి చేరువలో అత్యాధునిక సదుపాయాలతో గోరంట్లలో నూతన బ్రాంచ్‌ను ఏర్పాటు చేయడం సంతోషదాయకమన్నారు. బ్యాంకు ఛైర్మన్ ఏలూరి గురవయ్య మాట్లాడుతూ ప్రారంభం నుంచి శ్రద్ధాశక్తులతో ప్రతి రోజు బ్యాంకు పని విధానాన్ని మెరుగు పర్చుకుంటూ కస్టమర్లకు ఉత్తమ సేవలు అందిస్తున్నామన్నారు. బ్యాంకు అభివృద్ధికి నిరంతరం పాటుపడిన సిబ్బందిని, అందుకు సహకరించిన కస్టమర్లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

గుంటూరు మేయర్ రాజీనామా చేయాలి: కనపర్తి

అమరావతి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): గుంటూరు మేయర్ కావటి మనోహర్ నాయుడుకు ఏ మాత్రం నైతిక విలువలున్నా.. వెంటనే పదవికి రాజీనామా చేయాలని టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. గురువారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. 'ఎంతో చైతన్యం ఉన్న గుంటూరుకు వైసీపీకి చెందిన మనోహర్ కావడం ప్రజల దౌర్భాగ్యం. నిజాయితీ పరులైన నడింపల్లి, కొల్లి శారద, చుక్కా ఏసురత్నం మేయర్లుగా పని చేసి గుంటూరు ఘనత చాటారు. కానీ మనోహర్ పూర్తిగా అవినీతిలో కూరుకుపోయారు' అని విమర్శించారు.

ఇటువంటి వ్యక్తి ప్రథమ పౌరుడా?: కార్పొరేటర్ వరప్రసాద్

గుంటూరు, నవంబరు2 (ఆంధ్రజ్యోతి) : హైకోర్టు వ్యాఖ్యలపై నగర మేయర్ కావటి మనోహర్ నాయుడ నైతిక బాధ్యత వహిస్తూ తన పదవికి తక్షణమే రాజీనామా చేయాలని 35వ డివిజన్ టీడీపీ కార్పొరేటర్ ఈరంటి వరప్రసాద్ (సిటీబస్సు బాబు) డిమాండ్ చేశారు. తన కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటువంటి వ్యక్తి నగర ప్రథమ పౌరుడా? అని విమర్శించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో టీడీపీ అధినేత చంద్రబాబు అక్రమ అరెస్టును నిరసిస్తూ టీడీపీ కార్యకర్తలు నగరంలో నిరసన తెలియ జేస్తుంటే బాధ్యత కలిగిన వ్యక్తిగా వ్యవహరించాల్సిన మనోహర్ నాయుడు తాను మేయర్ ననే విషయం మరచి నిస్సిగ్గుగా మాట్లాడిన మాటలు దారుణమని అన్నారు. కేవలం తన పదవిని కాపాడుకోవడం కోసం ఇంతలా దిగజారి ప్రవర్తించాలా అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

జీజీహెచ్‌లో కార్డియాక్ కీహోల్ సర్జరీలు!

● సూపరింటెండెంట్ రమణ యశస్వి వెల్లడి

గుంటూరు మెడికల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రి కార్డియోథొరాసిక్ సర్జరీ విభాగంలో త్వరలో కార్డియాక్ కీహోల్ సర్జరీలను ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి తెలిపారు. గురువారం ఆసుపత్రి శుశృతహాల్‌లో జరిగిన మీడియా సమావేశంలో కార్డియోథొరాసిక్ సర్జరీ విభాగాధిపతి డాక్టర్ హరికృష్ణతో కలసి ఆయన మాట్లాడారు. కార్డియాక్ మినిమల్ ఇన్‌వేజివ్ పద్ధతిలో ఆపరేషన్లతో (కీహోల్ సర్జరీలు) రోగులు త్వరగా కోలుకుంటారని వారు తెలిపారు. గత ఐదు నెలల్లో ప్రభుత్వాస్పత్రి సీటీఎస్ వైద్యులు 90 గుండె ఆపరేషన్లు చేశారని ఆయన వివరించారు. ఇందులో 15 గుండె కవాటాల మార్పిడి ఆపరేషన్లు కాగా, మిగిలిన 75 బైపాస్ సర్జరీలు అని వివరించారు. ఇటీవల బైపాస్ సర్జరీలు చేయించుకొన్న మూడు క్లిష్టమైన కేసులను వారు మీడియా ముందుకు తెచ్చారు.కార్పోరేట్ హాస్పిటల్స్ నుంచి గుండె జబ్బు రోగులు ఆపరేషన్ల కోసం గుంటూరు జీజీహెచ్‌కు వస్తున్నట్లు డాక్టర్ హరికృష్ణ తెలిపారు. గుండె శస్త్రచికిత్సలు విజయవంతంగా నిర్వహిస్తున్న కార్డియో థొరాసిక్ సర్జన్లు డాక్టర్ కుప్పుస్వామి, డాక్టర్ యోగి, డాక్టర్ ప్రమోద, ఎనస్థటిస్ట్ డాక్టర్ పోలయ్యను సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి అభినందించారు. నెలకు 30 నుంచి 40 గుండె ఆపరేషన్లు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు.

బోరుగడ్డ బెయిల్ పిటీషన్లు సమర్థవంతంగా తిప్పికొడుతున్నాం: ఎస్పీ సతీష్‌కుమార్

గుంటూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం కేంద్ర కారాగారంలో ఉన్న రౌడీషీటర్ బోరుగడ్డ అనిల్ బెయిల్ పిటీషన్‌లను సమర్థవంతంగా తిపికొడుతున్నామని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ స్పష్టం చేశారు. ఒకే కేసులో బోరుగడ్డ బెయిల్ పిటిషన్‌ను కోర్టు మూడో సారి డిస్మిస్ చేసిందన్నారు. కేసును బలంగా వాదించేందుకు కీలక సాక్ష్యాధారాలు అందించామన్నారు. 18న బోరుగడ్డ అనిల్ కుమార్ పై అరండల్ పేట పోలీస్‌స్టేషన్ నందు నమోదైన క్రైం నెంబర్ 32/2021 కేసులో బోరుగడ్డ ఇప్పటి వరకు మూడు సార్లు 3వ సారి బెయిల్ పిటీషన్ దాఖలు చేయగా, క్రైమ్ నెంబర్. 236/2024 కేసులో మొదటి సారి బెయిల్ పిటిషన్ దాఖలు చేసిన అతని తరపు న్యాయవాది, ఈ రెండు కేసుల్లో డిఫెన్స్ న్యాయవాది, ప్రాసిక్యూషన్ వారి వాదనలు విన్న అనంతరం మేజిస్ట్రేట్ ఆయా రెండు బెయిల్ పిటిషన్‌లను కొట్టేసిందన్నారు. ఈ రెండు కేసులలో డిఫెన్స్ న్యాయవాది, ప్రాసిక్యూషన్ వాదనలు విన్న అనంతరం రెండు కేసులలో బెయిల్ పిటిషన్లను డిస్మిస్ చేస్తూ తీర్పు చెప్పారన్నారు ఈ రెండు కేసుల్లో బెయిల్ పొందకుండా కోర్టుకి సరైన సాక్ష్యాధారాలు సమర్పించడంలో కృషి చేసిన అరండల్‌పేట పోలీసులు, పోలీస్ తరఫున వాదనలు వినిపించిన పీపీ పవన్‌కుమార్‌ను ఎస్పీ అభినందించారు. కాగా బెయిల్ పొందేందుకు బోరుగడ్డ చేసే ప్రయత్నాలన్నింటినీ బెడిసికొట్టేలా చేస్తున్నామన్నారు.

కార్పొరేషన్‌లో రూ. 17 లక్షల నిధులు గోల్‌మాల్‌పై కేసు

గుంటూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో సెక్షన్ సూపరింటెండెంట్ గా పని చేస్తున్న సిరిల్ పాల్ గతంలో కార్పొరేషన్‌కు సంబంధించిన సుమారు రూ. 17 లక్షల నిధులను దారి మళ్లించాడు. కాంట్రాకర్లకు ఇవ్వాల్సిన ఆయా నిధులను వేరొకరి ఖాతాకు మళ్లించాడు. కాగా ఆడిట్ అధికారులు ఈ విషయం పసిగట్టడంతో వ్యవహారం వెలుగు చూసింది. సిరిల్‌పాల్ ఇదే తరహాలో గతంలో సుమారు రూ. 40 లక్షలు దారి మళ్లించగా అప్పట్లో ఆయనపై కేసు నమోదైంది. దీంతో ఆయనను విధుల నుంచి సస్పెండ్ చేశారు. అయితే అప్పటి ఘటనలో మరో రూ.17 లక్షల నిధులు కూడా దారి మళ్ళాయి. ఈ క్రమంలో ఆడిట్‌లో ఈ వ్యవహారం వెలుగుచూడటంతో నగర కమిషనర్ పులి శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు లాలాపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, నిందితుడు సిరిల్‌పాల్‌ను లాలాపేట పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

విద్యాశాఖ పూర్వ డీఈవో ద్వంద్వ వైఖరిపై విచారణ!

● నివేదిక కోరిన పాఠశాల విద్యాకమిషనర్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

గుంటూరు(విద్య),నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ఇటీవల వరకు జిల్లా విద్యాశాఖాధికారిగా బాధ్యతలు నిర్వర్తించిన పీ శైలజ పనితీరుపై పాఠశాల విద్యాశాఖ కమిషనరేట్ నుంచి నివేదిక కోరినట్లు సమాచారం. తాడికొండ మండలంలోని పొన్నెకల్లు జడ్పీ స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న షేక్ సమీర్ సహచర విద్యార్థులతో కలిసి గత నెల 24న ఈతకు వెళ్ళి మరణించాడు. ఇదే రోజున గుంటూరు డీఈవోను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. అయితే, కొత్త డీఈవో బాధ్యతలు స్వీకరించే వరకు పాత డీఈవో కొనసాగడం మామూలుగా జరిగే వ్యవహారమే. గతనెల 24న విద్యార్థి మరణించిన సంఘటనపై నాటి విద్యాశాఖాధికారిగా పని చేసిన శైలజ వ్యవహరించిన తీరుపై విమర్శలు వచ్చాయి. ఈ సంఘటన తన దృష్టికి రాలేదని, తాను బదిలీ అయ్యానని చెప్పడంపై ఉన్నత స్థాయిలో అధికారులు ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. వాస్తవంగా నూతన డీఈవో సీవీ రేణుక గత నెల 28న బాధ్యతలు స్వీకరించారు. అప్పటి వరకు పాత డీఈవోగా శైలజపైనే బాధ్యతలు ఉంటాయని విద్యాశాఖ వర్గాలు, ఉపా ధ్యాయ సంఘాలు స్పష్టం చేస్తున్నాయి. గతంలో పెదకాకాని మండలంలోని యాదవపాలెం ఎంపిపి స్కూల్ గేటు కూలిన సంఘటనలో హెచ్‌ఎంతో పాటు ముగ్గురు ఉపాధ్యాయులను అదేరోజు సస్పెండ్ చేశారు. తాడికొండ సంఘటనలో విద్యార్థి మరణించినా విషయాన్ని దాదాపు 20 రోజుల పాటు బయట ప్రపంచానికి తెలియనివ్వలేదు. ఈ నేపథ్యంలో తాడి కొండ జడ్పీ స్కూల్, పెదకాకాని మండలం యాదవ పాలెం ఎంపీపీ స్కూల్‌లో గేటు కూలిన సంఘటన, గతంలో చిన్నచిన్న తప్పులకే ఉపాధ్యాయులపై తీసుకున్న క్రమణ శిక్షణా చర్యల్ని క్రోడీకరిస్తూ ఈ నెల 19న 'ఆంధ్రజ్యోతి'లో 'డీఈవో ద్వంద్వ వైఖరి' శీర్షికన కథనం వెలువడిన విషయం తెలసిందే. గతంలో జరిగిన సంఘటలపై డీఈవో ఎలా స్పందించారు, తాజాగా తాడికొండ మండలం పొన్నెకల్లు జడ్పీ స్కూల్ సంఘటనపై నాటి డీఈవో ఎలా స్పందిచారో పూర్తిస్థాయిలో నివేదిక పంపాలని పాఠశాల విద్య కమిషనర్ నుంచి ఆదేశాలు రావడంతో బుధవారం రాత్రి అధికారులు నివేదిక తయారు చేసి పంపినట్లు సమాచారం.


శంకరమఠానికి విచ్చేసిన విధుశేఖర భారతీ మహాస్వామి, ధూళిపాదపూజ చేస్తున్న వేద పండితులు, పాల్గొన్న దంపతులు

నగరానికి శ్రీశృంగేరీ శారదా పీఠాధిపతి

గుంటూరు(తూర్పు), నవంబరు 21(ఆంధ్రజ్యోతి): దక్షిణామ్నాయ శ్రీశృంగేరీ శారదా పీఠం 37వ జగద్గురువులు శ్రీ శ్రీ విధుశేఖర భారతీ మహాస్వామి విజయ యాత్ర మహోత్సవ్లో భాగంగా నగరానికి చేరుకున్నారు. విధుశేఖర భారతీ స్వామికి వేదపండితుల స్వాగతవచనాలు, ఆగమనం పూర్ణకుంభస్వాగతంతో ఘన స్వాగతం పలికారు. స్థానిక సంపత్‌నగర్‌లోని శ్రీ శృంగేరి శంకరమఠం, శ్రీ శారదా పరమేశ్వరి దేవస్థానంలో భక్తులు పెద్దసంఖ్యలో హాజరై హారతులు సమర్పించారు. శ్రీ శారదా పరమేశ్వరి దేవస్థానంలో స్వామివారికి ధూళిపాదపూజ, స్వాగతపత్ర సమర్పణ నిర్వహించారు. అనంతరం స్వామివారి అమృత హస్తములతో శ్రీశారదా చంద్రమౌళీశ్వరుల పూజ నిర్వహించి భక్తులనుద్దేశించి అనుగ్రహభాషణ చేశారు. అంతకు ముందు నగరంలోని పోలిశెట్టి సోమసుందరం వ్యాపారసంస్థల కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా శారద పరమేశ్వరి దేవస్థానం ఆలయ గౌరవ ప్రతినిధి పోలిశెట్టి నాగ సుందరం మాట్లాడుతూ మూడు రోజుల పాటు నగరంలో స్వామి వారి పర్యటన జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా 22న శుక్రవారం శ్రీ వేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో గురువందనం కార్యక్రమంలో స్వామి వారు పాల్గొంటారని తెలిపారు. సంపత్‌నగర్‌లో శ్రీశృంగేరి శంకరమఠం శ్రీ శారదా పరమేశ్వరి దేవస్థానం వద్ద స్వామివారు ఈ నెల 24 వరకూ భక్తులకు ఆశీర్వచనాలు అందించనున్నారని చెప్పారు. కార్యక్రమంలో పోలిశెట్టి శ్రీహరిప్రసాదరావు, పోలిశెట్టి శ్యామసుందర్ దంపతులు పాల్గొన్నారు.



వెండి ఆభరణాల ప్రదర్శనను ప్రారంభిస్తున్న విద్యార్థినులు, స్టోర్ హెడ్ నదీర్ తదితరులు

మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్‌లో వెండి ఆభరణాల ప్రదర్శన ప్రారంభం

గుంటూరు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): స్థానిక లక్ష్మీపురం మెయిన్‌రోడ్డులోని మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ షోరూమ్‌లో వెండి ఆభరణాల ప్రదర్శన గురువారం ప్రారంభమైంది. ఈ నెల 21 నుండి 30 వరకు జరిగే ఈ ప్రదర్శనను విద్యార్థినిలు కావ్య శ్రీ, వైష్ణవి, సింధు,సర్వజ్ఞల చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ ప్రదర్శనలో భాగంగా వెండి సామాగ్రి, పట్టీలపై 25 శాతం వరకు తగ్గింపు ఉంటుందని, వెండి ఆభరణాల ఎమ్మార్పీ విలువలపై 10 శాతం తగ్గింపు పొందవచ్చని తెలిపారు. మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ నిబద్ధతలో భాగంగా తమ వినియోగదారులకు 11 న్యాయమైన వాగ్దానాలు అందిస్తున్నట్లు తెలిపారు. కార్య క్రమంలో స్టోర్ హెడ్ నదీర్, స్టోర్ మేనేజర్ వినయ్ కుమార్ మలబార్ సిబ్బంది ఉన్నారు.

15న మాలల మహాగర్జనను జయప్రదం చేయండి

గుంటూరు(తూర్పు), నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ డిసెంబరు 15న గుంటూరు, నల్లపాడు రోడ్డు, హౌసింగ్ బోర్డు కాలనీ వద్ద నిర్వహిస్తున్న మాలల మహాగర్జన సభను జయప్రదం చేయాలని అఖిల భారత మాల సంఘాల జేఏసీ చైర్మన్ ఉప్పులేటి దేవిప్రసాదు పిలుపు నిచ్చారు. స్థానిక అరండలపేటలోని ఓ హోటల్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సభకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని, మాదిగలు, మాలల మధ్య చిచ్చుపెట్టే ప్రయత్నం చేస్తోందని అన్నారు. మందకృష్ణ మాదిగకు ప్రచారం కల్పించే ప్రయత్నంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మాలలకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షుడు అన్నవరపు కిషోర్ మాట్లాడుతూ మంద కృష్ణ మాదిగ కృత్రిమ ఉద్యమం నడుపుతున్నాడని మండిపడ్డారు.

చింతలపూడిలో.. సంపెంగ సౌరభాలు

- రాష్ట్రంలో ఎక్కడికైనా ఇక్కడి నుంచే ఎగుమతి
- క్రమేపీ తగ్గుతోన్న విస్తీర్ణం
- ఆదుకోవాలంటున్న రైతులు



సంపెంగ చెట్టు గుబురు

పొన్నూరుటౌన్, నవంబరు21 : భారతీయ జీవన విధానంలో పుష్పాలకు ప్రత్యేక స్థానం ఉంది. అనేక రకాల పుష్ప జాతులను దేవతల పూజల కోసం శుభకార్యాలలోనూ మహిళల అలంకరణ కోసం వినియోగిస్తారు. వీటన్నిటిలో మగువలకు మల్లెలు అంటే ప్రీతి. గుబాలించే పరిమళం చూడచక్కని రూపం ఆకు సంపెంగ పూల విశిష్టత ప్రాంతాలను బట్టి సంపంగి, సంపెంగ, చంప, హరిచంప, ఆకుపచ్చ సంపెంగ, ఆకు సంపెంగ అంటూ చాల పేర్లతో ఈ పూలను పిలుస్తారు. దీని శాస్త్రీయ నామం ఆర్టబోట్రిస్ హెక్సాపెటలస్. ఈ చెట్టు మిగిలిన పూల మొక్కలకన్నా వైవిధ్యభరితంగా ఉంటుంది. నిగనిగలాడే ఆకులతో బూడిద రంగు కొమ్మలతో ఈ చెట్టు గుబురుగా ఎదుగుతుంది. సంపెంగ చెట్టు ఉందంటే ఆ ప్రాంతం అంతా సువాసన భరితంగా ఉంటుంది. పూలు వికసించినప్పుడే కాకుండా పువ్వు ఎండిపోయిన తర్వాత కూడా పరిమళాలు వెదజల్లుతుంది. మల్లెల తర్వాత సువాసనలు వెదజల్లే సంపెంగలు మగువల మనస్సు దోస్తాయి. సంపెంగ పూల వల్లన సువాసనలే కాకుండా సుంగధ లేపనాల తయారీ, ఔషధాల తయారీలోనూ ఉపయోగాలు ఉన్నాయి. వత్తిడిని తగ్గించే మందుల్లోనూ అనేక రుగ్మతులు తగ్గించే ఔషధాల తయారీకి ఈ సంపెంగలను వినియోగిస్తారు. ఈ సంపెంగల తోటల సాగుకు గుంటూరు జిల్లా పొన్నూరు మండలం చింతలపూడి గ్రామం చిరునామాగా మారింది. పూర్వీకుల నుంచి సంక్రమించిన సంపెంగల తోటలను సాగు చేస్తూ ఇక్కడి రైతు కుటుంబాలు జీవనాధారం పొందుతున్నాయి.



సంపెంగ పూలు

తగ్గుతున్న సాగు విస్తీరణం.....

సువాసనలు వెదజల్లే సంపెంగ పూల తోట సాగు క్లిష్టతరంగా ఉంటుంది. అందువల్లన సాగు విస్తీర్ణం తగ్గుతుంది. గతంలో పదుల ఎకరాల సంఖ్యలో ఉన్న సాగు క్రమేణ మూడు ఎకరాలకు తగ్గిపోయింది. ప్రధానంగా సాంప్రదాయ పద్ధతులో సంపెంగ తోటల సాగు ఉంటుంది. ఒక ఎకరానికి 100 చెట్ల వరకు పెంచుకునే వెసులుబాటు ఉంది. ప్రస్తుతం కడియం నర్సరీలో ఒక్కో చెట్టు రూ. 100కు విక్రయిస్తున్నారు. చెట్లు నాటటానికి ఎకరానికి రూ. 10 వేల వరకు ఖర్చు అవుతుంది. చెట్లు నాటిన తర్వాత పశువుల ఎరువు, డీఏపీ వంటి రసాయన ఎరువులు వినియోగిస్తే చెట్టు ఎత్తు పెరుగుతుంది. నాటిన రెండవ సంవత్సరం నుంచి చెట్ల నుంచి పూల దిగుబడి వస్తుంది. జీవిత కాలం పాటు ఈ చెట్టు నుంచి పూల దిగుబడి వస్తూనే ఉంటుంది. గుబురుగా పెరగటంతో పాటు ఎత్తు పెరగటం వల్లన పూల కోత కష్టతరంగా ఉంటుంది. ప్రతి 2, 3 సంవత్సరాల ఒక్క సారి గుబురుగా పెరిగిన చెట్ల కొమ్మలను కత్తిరించుకోవటం ద్వారా తిరిగి కొత్త కొమ్మలు పుట్టి పూల దిగుబడి మరింత పెరిగే అవకాశం ఉంది. సువాసనలు వెదజలే సంపెంగ పూల చెట్టు గుబురు కింద విష సర్పాలు సంచరిస్తూ ఉంటాయి. విష సర్పాలకు భయపడి సంపెంగ సాగు వైపు దృష్టిసారించటం లేదనే వాదన ఉంది.

సంపెంగ తోట నుంచి సీజన్‌లో ఎకరానికి 6 వేల పూల దిగుబడి రోజుకు వస్తుంది. సంక్రాంతి పండుగ నెల నుంచి ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ నెల వరకు సంపెంగ పూల సీజన్‌గా పిలుస్తుంటారు. ఈ సీ.జన్‌లలో ఎకరానికి పది వేల పూల దిగుబడి రోజుకు వస్తుంది. మే నెల వేసవి వడగాల్పుల తీవ్రతతో పూల దిగుబడి క్రమేపి తగ్గి తొలకరి వర్షాల నాటికి పూర్తిగా తగ్గిపోతుంది. చెట్టు వద్ద వందపూలను రూ.150కి టోకుగా విక్రయిస్తున్నారు. అదే రిటైల్ మార్కెట్‌లో పువ్వు రూ.3నుంచి రూ.5వరకు విక్రయించి రైతులు లాభాలను ఆర్జిస్తున్నారు. అయితే సంపెంగపూలు చెట్టు నుంచి కోసిన తర్వాత ఈ పూలు ఒక్కరోజు మాత్రమే సువాసనలు వెదజల్లి తర్వాత క్రమేపి వాడిపోతాయి. నిల్వ ఉండని కారణంగా ఈ పూల సాగు క్రమేణా తగుతూవస్తుంది. శుభకార్యాలు జరిగే సమయంలో, పండుగలు విశేష పర్వదినాల సమయంలోనూ ఈ సంపెంగ పూలకు అత్యధిక డిమాండ్ ఉంటుంది. మిగిలిన రోజుల్లో రిటైల్‌గా ఆలయాలకు దుకాణాలకు విక్రయించాల్సిన పరిస్థితులు ఉన్నాయి. సంపెంగ పూల సాగును ఉద్యాన శాఖ పరిధిలోకి తీసుకుని వచ్చి ప్రభుత్వం నుంచి ప్రోత్సహకం అందిస్తే సాగు విస్తీరణం మరింత పెంచటానికి అవకాశం ఉంటుందని చింతలపూడి ప్రాంత రైతులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలి....



రాష్ట్రంలో మరెక్కడ సాగు చేయని సంపెంగ తోటలు పొన్నూరు ప్రాంతానికే ప్రత్యేకం. ఈ పూల విక్రయాలు స్థానికంగానే జరుగుతున్నాయి. ఈ పూలకు సరైన మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తే మరింత సాగు విస్తీర్ణం పెరుగుతుంది. ఆయా ఆలయాల అధికారులు నేరుగా రైతుల నుంచి కొనుగోలు చేస్తే దళారుల బాధ తగ్గుతుంది. ప్రభుత్వం సాగుకు ప్రోత్సాహం ఇవ్వాలి.

- నల్లూరి వీరయ్య చౌదరి, చింతలపూడి సంపెంగ సాగు రైతు

ఉద్యాన శాఖ పరిధిలోకి తీసుకురావాలి..



సంపెంగ సాగును ఉద్యానశాఖ పరిధిలోకి తెచ్చి రాయితీలు అందించాలి. ఉద్యాన శాఖ మిగిలిన పూలతోటల సాగుకు ఇచ్చిన ప్రోత్సాహకాలను సంపెంగల సాగుకు అందించాలి. మొక్కలను రాయితీపై సరఫరా చేయటమే కాకుండా సాగుకు అవసరమైన పెట్టుబడి సహాయం అందించటం ద్వారా సాగు విస్తీర్ణం మరింత పెరుగుతుంది. అంతేకాకుండా సుగంద తైలం తయారు చేసే పరిశ్రమలను ఏర్పాటు చేయాలి.

- నల్లూరి హరిబాబు, చింతలపూడి, పూల రైతు

డిజిటల్ అరెస్ట్ అంటే.. భయపడాల్సిన పనిలేదు

- అటువంటి కాల్స్ వస్తే సైబర్‌క్రైమ్ హెల్ప్‌లైన్ నెంబర్ 1930కి కాల్ చేస్తే చాలు
- ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి
- గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్



గుంటూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : డిజిటల్ అరెస్ట్ అంటే ఎవరూ భయపడాల్సిన పని లేదని గుంటూరు జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ స్పష్టం చేసారు. గురువారం గుంటూరులో ఆయన విలేకరులతో మాట్లాడారు. డిజిటల్ అరెస్ట్ అనేది కేవలం సైబర్ నేరగాళ్ళ మోసపూరిత బెదిరింపుగానే తీసుకోవాలి గానీ కంగారుపడాల్సిన పనిలేదన్నారు. ఎవరైనా మీకు సాధారణ (లేదా) ఆన్లైన్ యాప్స్ వాట్సాప్, టెలిగ్రామ్, స్కైప్ వంటి వాటి ద్వారా కాల్స్ చేసి డిజిటల్ అరెస్టు చేస్తున్నాం అంటే భయపడవద్దన్నారు. అనుమానాస్పద కాల్స్ వస్తే వెంటనే నేషనల్ సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నెంబర్ 1930 కు ఫిర్యాదు చేయాలన్నారు. ఈ మధ్యకాలంలో అత్యధికంగా సైబర్ నేరగాళ్లు "డిజిటల్ అరెస్ట్" పేరుతో ముంబై , ఢిల్లీ నగరాల నుండి పోలీస్, ఇన్కమ్ టాక్స్, సీబీఐ, ఎన్ఐఏ, ఏసీబీ తదితర శాఖల అధికారులుగా నటిస్తూ సాధారణ కాల్స్ (లేదా) వాట్సాప్, టెలిగ్రాం, స్కైప్ మొదలగు ఆన్లైన్ యాప్స్ ద్వారా నకిలీ ఫోన్ కాల్స్, వీడియో కాల్స్ చేసి ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. మాదకద్రవ్యాలు, మనీలాండరింగ్ కేసుల్లో వారి ప్రమేయం ఉన్నట్లు నమ్మించి, వారిని అరెస్టు చేస్తున్నామని బెదిరించి, అరెస్టు కాకుండా ఉండాలంటే అపరాధ రుసుము చెల్లించాలని బెదిరించి డబ్బు కాజేస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో ప్రజలు గుర్తు తెలియని వ్యక్తులు నుండి వచ్చే ఫోన్ కాల్స్ వీడియో కాల్స్‌కు స్పందించవద్దన్నారు.

సైబర్ నేరాలపై ప్రజలు తెలుసుకోవలసిన విషయాలు....

ప్రభుత్వ సంస్థలు వీడియో లేదా ఆడియో కాల్స్ లేదా మెసేజ్‌లు ద్వారా అరెస్టులు చేయవన్నారు. బ్యాంకులు, బ్యాంకింగ్ రంగ సంస్థలు ఏవి కూడా వ్యక్తిగత వివరాలు, ఓటీపీ లేదా బ్యాంకు వివరాలు ఎప్పుడూ అడగవన్నారు. ఎవరైనా ఆయా వివరాల కోసం ఫోన్ చేస్తే అది ఫేక్ కాల్‌గా గుర్తించి కట్ చేయాలన్నారు. ఆయా వివరాలను ఎవరితోనూ పంచుకోవద్దన్నారు. ప్రజలు అప్రమత్తంగా, ధైర్యంగా ఉంటూ సైబర్ నేరాల పట్ల అవగాహన కలిగి డిజిటల్ అరెస్ట్ మోసాల బారిన పడకుండా జాగ్రత్త పడాలని ఎస్పీ సతీష్‌కుమార్ సూచించారు.

త్రికోటేశ్వరస్వామిని దర్శించుకున్న శృంగేరి పీఠాధిపతి



కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న శృంగేరి శారదా పీఠం జగద్గురు శ్రీ విధుశేఖర భారతీ మహాస్వామి

నరసరావుపేట రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ శైవక్షేత్రమైన కోటప్పకొండలో వేంచేసియున్న త్రికోటేశ్వర స్వామిని శృంగేరి శారదా పీఠం జగద్గురు శ్రీవిధుశేఖరభారతీ మహాస్వామి గురువారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు జగద్గురు భారతీ మహాస్వామికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం స్వామివారికి భారతీ మహాస్వామి స్వయంగా ప్రత్యేక పూజలు చేశారు. త్వరలో కోటప్పకొండలో జగద్గురు శ్రీవిధుశేఖర భారతీ ఆధ్వర్యంలో కుంభాభిషేకం జరుగుతుందని అర్చకులు అప్పయ్యగురువులు తెలిపారు. నరసరావుపేట రూరల్ సీఐ రామకృష్ణ కొండపై బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఆరోగ్య జీవనానికి క్రీడలు దోహదం

- డీఆర్ఎం కప్ - 2024 ప్రారంభోత్సవంలో కలెక్టర్ నాగలక్ష్మి



పట్టాభిపురంలోని రైల్ వికాస్ భవన్‌లో డీఆర్ఎం కప్ - 2024 క్రీడలను ప్రారంభిస్తున్న కలెక్టర్, డీఆర్ఎం తదితరులు

గుంటూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యవంతమైన జీవితానికి క్రీడలు దోహదం చేస్తాయని గుంటూరు జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి అన్నారు. గురువారం సాయంత్రం గుంటూరు పట్టాభిపురంలోని గుంటూరు డివిజన్ రైల్వే మేనేజర్ కార్యాలయంలో 2వ డీఆర్ఎం కప్ - 2024 క్రీడా పోటీల ప్రారంభ కార్యక్రమం జరిగింది. క్రీడాకారులతో క్రీడా ప్రతిజ్ఞ చేయించి పోటీలు ప్రారంభించినట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వ, అనుబంధ శాఖల ఉద్యోగులు క్రీడలు ఆడటం వలన రోజు వారి పని ఒత్తిడి నుంచి ఉపశమనం పొందవచ్చన్నారు. డివిజనల్ రైల్వే అధికారులు ఇతర కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల టీంలతోనూ క్రీడా పోటీలు నిర్వహించడం చాలా అభినందనీయమన్నారు. ఇతర శాఖల టీంలతో పాల్గొనడం వల్ల క్రీడా నైపుణ్యాన్ని మెరుగుపరచుకోవడంతో పాటు టీం స్పిరిట్ పెంపొందించుకోవచ్చని, ఇతర శాఖలతో సత్సంసబంధాలు ఏర్పడతాయన్నారు. డీఆర్ఎం కప్‌క్రీడా పోటీలలో మహిళా ఉద్యోగుల టీంలకు అవకాశం కల్పించాలని సూచించారు. గుంటూరు డివిజన్ రైల్వే మేనేజర్ ఎం రామకృష్ణ మాట్లాడుతూ ఈడీఆర్ఎం కప్ క్రీడా పోటీల వలన రైల్వేలోని శాఖల మధ్య సమన్వయంపెంపొందించుటమే కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయం, స్నేహభావాన్ని పెంపొందిస్తుందని తెలియజేశారు. డీఆర్ఎం కప్ - 2024 క్రీడా పోటీలలో డివిజన్ పరిధిలో ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం, నంద్యాల, తెలంగాణలోని యాదాద్రి భువనగిరి, నల్గొండ కలిపి మొత్తం ఏడు జిల్లాల పరిధిలోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు క్రికెట్, బ్యాడ్మింటన్, వాలీబాల్, బాస్కెట్ బాల్ క్రీడలలో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మొదటి డీఆర్ఎం కప్ పోటీల కంటే రెండవ విడతలో నిర్వహిస్తున్న క్రీడా పోటీలు మరింత మెరుగ్గా నిర్వహించడం జరుగుతుందన్నారు. కలెక్టర్ సూచనల మేరకు మూడవ విడత నిర్వహించే డీఆర్ఎం కప్ - 2025 క్రీడా పోటీలలో మహిళ ఉద్యోగుల టీంలు పాల్గొనేలాఅవకాశం కల్పిస్తామన్నారు. సభ అనంతరం కలెక్టర్ నాగలక్ష్మి, సంయుక్త కలెక్టర్ ఏ భార్గవ్ తేజ, గుంటూరు డివిజన్ రైల్వే మేనేజర్ రామకృష్ణ, రీజనల్ పాస్ పోర్ట్ ఆఫీసర్ శివ హర్ష బాస్కెట్ బాల్ ఆడి క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎడీఆర్ఎం సైమన్, సీపీఎం మనోహర్ రెడ్డి, స్పోర్ట్స్ ఆఫీసర్ దినేష్‌కుమార్, క్రీడాకారులు పాల్గొన్నారు.

సౌత్‌జోన్ చెస్ పోటీలకు ఏఎన్‌యూ జట్లు ఎంపిక



సౌత్ జోన్ చెస్ పోటీలకు ఎంపికైన విద్యార్థినులతో సెలక్టర్లు

తాడికొండ, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం చదరంగం పురుషుల, మహిళల జట్లను ఎంపిక చేసినట్లు జట్ల మేనేజర్ ఏ.వీ.రాఘవయ్య తెలిపారు. లాం చలపతి ఫార్మసీ కళాశాలలో జరిగిన నాగార్జున విశ్వవిద్యాలయ అంతర్ కళాశాలల చెస్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో వర్సిటీ జట్లను గురువారం ఎంపిక చేశారు. పురుషుల జట్టులో ఆర్‌వీఆర్‌జేసీ కాలేజ్ నుంచి కే.సాయి శ్రీకాంత్, ఎం.వంశీ, మహమ్మద్ ఇస్మాయిల్, బీ. గోవింద్, బాపట్ల ఇంజనీరింగ్ కళాశాల నుంచి జీ.జయప్రకాష్, పీ. గణేష్ ఎంపికయ్యారు. తమిళనాడులోని వెల్ టెక్ యూనివర్సిటీలో జనవరిలో జరిగే సౌత్ జోన్ పోటీలలో వీరు పాల్గొంటారు. మహిళల విభాగంలో జేకేసీ కళాశాల నుంచి ఎస్.వైష్ణవి, చలపతి ఫార్మసీ కళాశాల నుంచి బీ.సాయితేజ, ఆర్. నాగవైష్ణవి, కే. స్వప్నమాధురి, బాపట్ల కళాశాల నుంచి ఎల్ జాయిస్ మేరీ, సీహెచ్ అనూషాలు ఎంపికయ్యారన్నారు. వీరు విశాఖలోని గీతం యూనివర్సిటీలో డిసెంబరు 5న జరిగే సౌత్ జోన్ పోటీల్లో పాల్గొంటారు. జట్లకు మేనేజర్‌గా పీ.భానుప్రకాష్ వ్యవహరిస్తారు. కార్యక్రమంలో చలపతి ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ నాదెండ్ల రామారావు, తదితరులు పాల్గొన్నారు.

ఆందోళన రేకెత్తిస్తున్న.. ఔషధ నిరోధకత!

- మొండికేస్తున్న సూక్ష్మజీవులు
- మందులూ ప్రభావం చూపడం లేదు
- 24వ తేదీ వరకు అవగాహన వారోత్సవాలు





గుంటూరు మెడికల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): .యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్ (ఔషధ నిరోధకత/ఏఎంఆర్) తీవ్ర ప్రజారోగ్య సమస్యగా పరిణమిస్తోంది. మనుష్యుల్లో జబ్బులకు కారణమయ్యే బ్యాక్టీరియా, వైరస్, ఫంగస్, ఇతర పరాన్నజీవులు ఔధాలకు లొంగకపోవడమే ఏఎంఆర్. దీని వల్ల చిన్న ఇన్‌ఫెక్షన్లు కూడా మందులకు లొంగని విధంగా మొండిగా మారే ప్రమాదం ఉంటుంది. యాంటీ బయోటిక్ మందులు విచ్చలవిడిగా, అవసరం ఉన్నా, లేకున్నా వినియోగించడం ఔషధ నిరోధకతకు ప్రధాన కారణంగా వైద్యులు చెబుతున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ విడుదల చేసిన గణాంకాల ప్రకారం...ఏటా ఔషధ నిరోధకత కారణంగా 50 లక్షల మంది మృతి చెందుతున్నారు. 2050 నాటికి ఈ సంఖ్య కోటికి చేరుతుందని అంచనా. దీనిపై ప్రజల్లో అవగాహన కల్పించి సమస్యను కట్టడి చేసేందుకు నవంబరు 18 నుంచి 24వ తేదీ వరకు 'వరల్డ్ యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్ వీక్ (వావ్) నిర్వహిస్తున్నారు. ఔషధ నిరోధకత వారోత్సవాల సందర్భంగా ఈ ఏడాది 'ఎడ్యుకేట్, అడ్వకేట్, యాక్ట్ నౌ అనే నినాదం ఇచ్చారు. ఏఎంఆర్ సమస్యపై ప్రజల దృష్టికి మరల్చేందుకు నీలి రంగును ఈ వారం రోజులు వైద్య సిబ్బంది నీలి రంగు దుస్తులు ధరించాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ కోరింది.

జిల్లాలో ర్యాలీలు...ప్రదర్శనలు

ఔషధ నిరోదకతకపై ప్రజల్లో, వైద్య సిబ్బందిలో అవగాహన పెంచేందుకు గుంటూరు వైద్య కళాశాల మైక్రోబయాలజీ విభాగం ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వాస్పత్రిలో పారా మెడికల్ సిబ్బంది, వైద్య విద్యార్థులతో పాటు సాధారణ రోగులు, వారి వెంట వచ్చే సహాయకులకు అవగాహన కల్పిస్తున్నారు. ఔషధ నిరోధకతపై ప్రజల్లో అవగాహన కోసం మెడికల్, ఫార్మసీ, నర్సింగ్ విద్యార్థులు జిల్లాలో ర్యాలీలు, ప్రదర్శనలు చేస్తున్నారు. "అవసరం లేకున్నా రోగులకు యాంటీ బయోటిక్ మందులు సూచించవద్దని ఆర్ఎంపీ వైద్యులకు అవగాహన కల్పిస్తున్నామని" గుంటూరు వైద్య కళాశాల యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్ నోడల్ అధికారి డాక్టర్ కే క్వీనాలీన తెలిపారు. ఏఎంఆర్‌పై మెడికల్ పీజీ, యూజీ విద్యార్థులకు క్విజ్, డిబేట్, పోస్టర్ ప్రెజెంటేషన్ పోటీలు నిర్వహించినట్లు ఆమె తెలిపారు.

పలు మందులకు ఔషధ నిరోధకత....

న్యూఢిల్లీలోని నేషనల్ సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ (ఎన్‌సీడీసీ)కి అనుబంధంగా గుంటూరు వైద్య కళాశాల సూక్ష్మ జీవ శాస్త్ర విభాగంలో ఏఎంఆర్‌పై సర్వెలెన్స్ నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ సమగ్రాస్పత్రిలో ఇన్‌పేషెంట్లుగా చేరిన రోగుల రక్తం, మూత్రం, మలం, చర్మం, చీము, పలు ఇతర నమూనాలను పరీక్షించి వారి జబ్బుకు డ్రగ్ సెన్సిటివిటీని (ఏ మందు వాడితే సూక్ష్మజీవి నశిస్తుందో) తెలియజేస్తున్నారు. ఈ రిపోర్ట్ ఆధారంగా వైద్యులు చికిత్సలు అందిస్తున్నారు. నెలకు 500 నమూనాలు ఇక్కడ పరీక్షిస్తున్నారు. ఈ నమునాలకు కల్చర్ పరీక్షలు చేసి సూపర్ బగ్స్‌ను వేరు చేసి గుర్తిస్తున్నారు. రోగుల నమూనాలను నుంచి సూడోమోనాస్, ఎసింటోబ్యాక్టర్, క్లెప్సెల్లా, ఈకోలీ వంటి సూపర్ బగ్స్‌ను గుర్తించినట్లు మైక్రోబయాలజీ విభాగాధిపతి డాక్టర్ కే పరమేశ్వరి తెలిపారు. ఆయా సూపర్ బగ్స్.వ్యాంకోమైసిన్, కొలిస్టిన్, మెథిసిలీన్ వంటి యాంటీ బయోటిక్ మందులకు లొంగని విధంగా మొండిగా మారినట్లు ఆమె వెల్లడించారు.

సమాజానికి అన్యాయం చేయడమే

- డాక్టర్ కల్యాణ్ చక్రవర్తి, ఇన్‌ఫెక్షన్ వ్యాధుల వైద్యనిపుణులు



యాంటీ బయోటిక్ మందులను విచ్చలవిడిగా వాడటం సమాజానికి అన్యాయం చేసినట్లే. శరీరంలో 96 మంచి బ్యాక్టీరియాలు ఉంటే, కేవలం 4 చెడు బ్యాక్టీరియాలు ఉంటాయి. అవసరం లేకుండా యాంటీ బయోటిక్ మందులు వాడితే, అవి మంచి బ్యాక్టీరియాలను నాశనం చేస్తాయి. దీని వల్ల అనారోగ్యం బారిన పడతాం. ప్రాణాపాయ స్థితిలో ఐసీయూ వార్డుల్లో చేరే చాల మంది రోగుల్లో యాంటీ బయోటిక్ మందులు పనిచేయడం లేదు.

ప్రజల్లో అవగాహన పెరగాలి

- డాక్టర్ క్వీనాలీనా, ఏఎంఆర్ నోడల్ అధికారి, జీఎంసీ



యాంటీ బయోటిక్ మందులు రోగులు సొంత నిర్ణయంపై వాడకూడదు. ఈ విషయంలో ప్రజల్లో అవగాహన పెరగాలి. వైద్యులు కూడా తగిన వ్యాధి నిర్ధారణ పరీక్షల అనంతరం అవసరమైతే యాంటీ బయోటిక్ మందులు రాయాలి. యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్ తీవ్రతను డాక్టర్లకు వైద్య విద్యార్థులకు, ప్రజలకు అవగాహన కల్పించేందుకు మైక్రోబయాలజీ విభాగం ద్వారా పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

మందులను తగిన విధంగా వాడాలి

- డాక్టర్ రేవూరి హరికృష్ణ, ఇన్‌ఫెక్షన్ వ్యాధుల వైద్యనిపుణులు



చాల జ్వరాలు వైరల్ ఫీవర్లు. వీటికి యాంటీ బయోటిక్ మందులు పని చేయవు. యాంటీ వైరల్ మందులు వాడాలి. కాని ఆర్ఎంపీలు, మెడికల్ షాపు దుకాణాల వారు జ్వరం అనగానే యాంటీ బయోటిక్ మందులు ఇస్తున్నారు. ఇది సరికాదు. ఈ విషయంలో రోగుల దృక్పథంలో మార్పు రావాలి. తగిన వ్యాధి నిర్ధారణ పరీక్షల అనంతరం రోగుల అవసరం మేరకు ఈ మందులు వైద్యులు సూచిస్తారు.

మూడు నెలలైనా.. ఇబ్బంది లేదు

- పెన్షన్‌దారులకు శుభవార్త
- మూడు నెలల వరకు బకాయిలు పొందవచ్చు
- ఆ తర్వాతా పునరుద్ధరణ కు అవకాశం
- ఉమ్మడి జిల్లాలో 7.59 లక్షల మందికి ఉపయోగం

గుంటూరు సిటీ, నవంబర్ 21 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో ఒక నెల పెన్షన్ తీసుకోకపోతే రెండో నెలలో బకాయి సొమ్ము ఇచ్చేవాళ్ళు కాదు. వరుసగా మూడు నెలలు పెన్షన్ పొందకపోతే వాళ్లని లబ్ధిదారుల జాబితా నుండి శాశ్వతంగా తొలగించేవాళ్ళు. కుదిరీ కుదరక అలా పెన్షన్ సొమ్ము, పెన్షన్ పొందే అవ కాశం పోగొట్టుకున్న వాళ్ళు చాలామంది ఉన్నారు. ఇప్పుడు ఆ బాధ లేదు. పెన్షన్ దారులకు కూటమి ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. ఎన్టీఆర్ భరోసా పెన్షన్ తీసుకుంటున్న వాళ్ళ ప్రయోజనం ఎక్కడా దెబ్బ తినకుండా నిర్ణయం తీసుకుంది. ఒక నెల ,రెండు నెలలు వరకు కుదిరీ కుదరక పెన్షన్ తీసుకోక పోయినా హైరానా పడాల్సిన అవసరం లేదు. రెండు నెలల వరకు తీసుకోక పోయినా మూడో నెలలో మొత్తం బకాయిలు చెల్లించే విధంగా ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. నవంబర్ నుంచే ఈ విధానం అమల్లోకి వచ్చినట్లు గుంటూరు జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి తెలియజేశారు. వరుస గా మూడు నెలలు వరకు పెన్షన్ పొందని వారిని మాత్రమే శాశ్వత వలసగా పరిగణించి పెన్షన్ నిలిపి వేస్తారు.

శాశ్వత వలస దారులకు మళ్ళీ అవకాశం

గత ప్రభుత్వం రెండు, మూడు నెలలు పెన్షన్ తీసుకోక పోతే లబ్ధిదారుల ప్రయోజనానికి శాశ్వతంగా గండి కొట్టేది. కూటమి ప్రభుత్వం అటువంటి నిబంధన పూర్తిగా ఎత్తి వేసింది. మూడు నెలల పాటు పెన్షన్ తీసుకొని వారిని శాశ్వత వలస దారులుగా గుర్తిస్తారు. వారి పెన్షన్ తాత్కాలికంగా నిలిపివేసినా తర్వాత పునరుద్ధరణకు అవకాశం కల్పించారు. వరుసగా మూడు నెలలు పెన్షన్ తీసుకోకుండా, శాశ్వత వలసదారులుగా పరిగణిస్తే, వారు మునిసిపల్ కమిషనర్, మండల అభివృద్ధి అధికారికి దరఖాస్తు చేసుకుంటే పెన్షన్ పునరుద్ధరిస్తారు.

ఉమ్మడి జిల్లాలో...

ప్రభుత్వం తీసుకున్న ప్రస్తుత నిర్ణయం వల్ల ఉమ్మడి గుంటూరు జిల్లాలో ని 7,59,963 పెన్షన్ దారులకు మేలు జరుగుతుంది. గుంటూరు జిల్లాలో 2,55,258, పల్నాడు జిల్లాలో 2,75,070, బాపట్ల జిల్లాలో 2,29,635 మంది ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పొందుతున్నారు.

గుంటూరు రూరల్ వార్తలు

◆ మంగళగిరి ◆ తాడికొండ ◆ ప్రత్తిపాడు

పశ్చిమ డెల్టా కాల్వకు 3800 క్యూసెక్కుల నీరు

దుగ్గిరాల, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): విజయవాడ ప్రకాశం బ్యారేజి నుంచి పశ్చిమ డెల్టా కాల్వకు 3800 క్యూసెక్కుల సాగునీటిని గురువారం విడుదల చేసినట్లు నీటిపారుదలశాఖ అధికారులు తెలిపారు. బ్యారేజి వద్ద 12.0 అడుగుల నీటి మట్టం ఉంది. కాగా దుగ్గిరాల సబ్‌డివిజన్ నుంచి హైలెవెల్ ఛానల్‌కు 216 క్యూసెక్కులు, రేపల్లె కాల్వకు 513 క్యూసెక్కులు, తూర్పు కాల్వకు 53 క్యూసెక్కులు, పశ్చిమ కాల్వకు 49 క్యూసెక్కులు, నిజాంపట్నంకాల్వకు 114క్యూసెక్కులు, కొమ్మమూరు కాల్వకు 2610 క్యూసెక్కులనీరు, విడుదల చేస్తున్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలి

● గింజుపల్లి శివరామప్రసాద్

ప్రత్తిపాడు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ సభ్యత్వాలను వేగవంతం చేయాలని తెలుగురైతు రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ గింజుపల్లి శివరామప్రసాద్ అన్నారు. ప్రత్తిపాడు పార్టీ కార్యాలయంలో సభ్యత్వ నమోదు కార్యక్రమంపై మండల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామం నుంచి పార్టీ సభ్యత్వాలను పెంచాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు గింజుపల్లి శివరామప్రసాద్, డీసీసీబీ మాజీ వైస్ చైర్మన్ కుర్రి సుబ్బారెడ్డి, తెలుగుయువత అధ్యక్షుడు చిన్నం శ్రీకాంత్, మాకినేని జగన్‌మోహన్ రావు, వంగిపురం ఎంపీటీసీ పాలేటి సాంబివరావు, నాదేండ్ల వెంకయ్య, చెన్నుబోయిన శ్రీనివాసరావు, మల్లం రామకృష్ణ, మల్లేశ్వరరావు, వెల్లివెల్లి సుబ్బారావు, వలివేటి భవానీశంకర్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

రగ్బీ జిల్లా జట్టుకు నూతక్కి విద్యార్థినులు



రగ్బీ పోటీలకు ఎంపికైన విద్యార్థులతో హెచ్ఎం జేమ్స్‌వాణి

మంగళగిరి సిటీ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి మండలం నూతక్కి జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన నలుగురు విద్యార్థినులు రగ్బీ జిల్లా జట్టుకు ఎంపికైనట్టు ఇన్‌చార్జి హెచ్ఎం జేమ్స్‌వాణి తెలిపారు. ఎ.శ్రీలక్ష్మీ, షారోన్ కృపావల్లి, ఎస్కే సుమియా, పీ.ఉస్మాలు అద్భుత ప్రతిభ కనబర్చి జిల్లా జట్టులో స్థానం సంపాదించారని పేర్కొన్నారు. కాకినాడలో ఈ నెల 23వ తేదీ నుంచి జరిగే 68వ రాష్ట్రస్థాయి రగ్బీ చాంపియన్‌షిప్‌లో వీరు పాల్గొంటారని తెలిపారు. జిల్లా జట్టుకు ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు అభినందించారు.

టీడీపీ సభ్యత్వానికి విశేష స్పందన



తుళ్లూరు ఐనచెరువుకాలనీలో టీడీపీ సభ్యత్వ నమోదు చేస్తున్న టీడీపీ నేతలు

తుళ్లూరు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వ నమోదులో కార్యకర్తలు ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నట్టు నాయకులు తెలిపారు. టీడీపీ సభ్యత నమోదు కార్యక్రమం తుళ్లూరులోని ఐనచెరువు కాలనీలో గురువారం నిర్వహించారు. ఫోన్‌లోనే సభ్యత్వ నమోదు చేశారు. 250 మంది టీడీపీ సభ్యత్వం తీసుకున్నారు. కార్యకర్తలకు అండగా ఉండాలని సభ్యత్వం తీసుకున్న వారికి ఇన్సూరెన్సు వర్తింపచేస్తున్నామని నేతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ జొన్నలగడ్డ కిరణ్, గ్రామ అధ్యక్షుడు కాటా అప్పారావు, నాయకులు ఉప్పలపాటి సాంబశివరావు, జమ్ముల అనిల్, హరి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

దానబోయినకు పరామర్శ

తాడేపల్లి టౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): గత నెలలో కిడ్నీ మార్పిడి శస్త్ర చికిత్స చేయించుకొని తాడేపల్లిలోని తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్న టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి దానబోయిన సుందరావు యాదవ్‌ను పలువురు పరామర్శించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. గురువారం మంగళగిరి శివాలయం ట్రస్టుబోర్డు మాజీ చైర్మన్ బోగి కోటేశ్వరరావు, టీడీపీ నేత నల్లగొర్ల శ్రీరామకృష్ణ సుందరావును కలిసి ఆరోగ్య పరిస్థితి గురించి వాకబు చేశారు.

తండ్రి మరణాన్ని రాజకీయాలకు వాడుకున్న ఘనుడు జగన్

● కొల్లా వీరయ్య చౌదరి

కాకుమాను, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): హెలికాప్టర్ ప్రమాదంలో దుర్మరణం పొందిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మరణాన్ని రాజకీయాలకు వాడుకున్న ఘనుడు వైఎస్ జగన్ అని టీడీపీ సీనియర్ నాయకులు కొల్లా వీరయ్య చౌదరి, మాజీ ఎంపీపీ రాంగోపాల్ అన్నారు. స్థానిక మండల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో గురువారం విలేకర్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు మాట్లాడుతూ వైసీపీ అధినేత జగన్ తన సొంత మీడియాలో చంద్రబాబునాయుడు తల్లిదండ్రులకి అన్నం పెట్టారా అని మాట్లాడడం అవివేకమన్నారు. వైఎస్సార్ మరణంతో రాష్ట్ర వ్యాప్తంగా శోక సంద్రంగా మారితే జగన్ మాత్రం పదవీ కాంక్షతో అప్పటి ఎమ్మెల్యేలతో సంతకాల సేకరణ నిర్వహించడం నిజం కాదా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో తెలుగురైతు విభాగం ప్రధాన కార్యదర్శి నక్కల అగస్టీన్, నల్లమోతు పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

తూర్పుపాలెంలో జ్వరాల సర్వే

ప్రత్తిపాడు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు శివారు తూర్పుపాలెంలో జ్వరాలపై గ్రామంలో పంచాయతీ అధికారులు సర్వే నిర్వహించారు. ఆశాలు, ఏఎన్ఎంల, ఎంపీహెచ్‌వోలు ఇంటింటికి తిరుగుతూ జ్వరాలపై సర్వే నిర్వహించారు.

రోడ్డు మార్జిన్‌లో మిల్లుల వ్యర్థాలు

● పాతమద్రాసు రోడ్డులో 5వ మైలు వద్ద డంపింగ్
● వ్యర్థాలను కాల్చి పొగబెడుతున్న వైనం
● అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు



ఐదో మైలు సమీపంలో రోడ్డు వెంట వ్యర్థాలు వేసి తగల బెడుతూ పొగ పెడుతున్న దృశ్యం

ప్రత్తిపాడు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): గుంటూరు - పర్చూరు పాత మద్రాసు రోడ్డులో ఐదో మైలు వద్ద రోడ్డు వెంబడి తగలబెడుతున్న వ్యర్థాలు.. వాటి నుంచి వస్తున్న పొగ.. గాలులకు లేచి వస్తున్న దుమ్ము ప్రయాణికులకు ఇబ్బందులు కలిగిస్తున్నాయి. ఈ రహదారిలో ఐదో మైలు వద్ద పలు రకాల కంపెనీలు ఎక్కువగా ఉన్నాయి. ఈ కంపెనీలలో వ్యర్థాలను వీరు నిత్యం రోడ్డు వెంట రాత్రి సమయంలో డంప్ చేయడంతో పాటు అక్కడే నిప్పు పెడుతున్నారు. దీంతో ఆ వ్యర్థాలు చిన్నగా తగలబడుతూ 24 గంటలు గాలివాటంగా పొగను చిమ్ముతూనే ఉంటుంది. దీంతో ప్రధాన రోడ్డుపై రోజు తిరిగే వేల కొద్ది వాహనదారులకు ఈ పొగ ఇబ్బంది పెట్టడంతో గాలి వాలుకు దుమ్ము లేచి ప్రయాణికులపై పడుతుంది. దీని వల్ల ద్విచక్ర వాహన చోదకుల కళ్లలో బూడిద పడుతుండటం పరిపాటిగా మారింది. అయితే కొద్ది రోజులకు ఒకసారి ఎవరైతే ఇక్కడ వ్యర్థాలను వేస్తున్నారో వారే రోడ్డు వెంట ప్రాంతం మొత్తం సరి చేయడం, మరలా వ్యర్థాలు వేయడం పరిపాటిగా మారింది. రోడ్డు వెంట వ్యర్థాలు వేయడానికి ఎలాంటి అనుమతులు లేవని.. పత్తి మిల్లులు, ఇతర కంపెనీల నుంచి వచ్చే వ్యర్థాలను ఎట్టి పరిస్థితుల్లోనూ రోడ్డు వెంట వేయడానికి వీల్లేదని స్థానికులు అంటున్నారు. నిత్యం ప్రధాన రహదారిపై పొగ బెడుతున్నా అధికారులు మాత్రం పట్టించుకున్న దాఖలాలు లేవు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు వెంట వ్యర్థాలు వేయకుండా చూడాల్సిన అవసరం ఉంది.

జనగణనతోపాటే సమగ్ర కులగణన చేపట్టాలి : కేసన



సమావేశంలో మాట్లాడుతున్న కేసన శంకరరావు

మంగళగిరి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయిలో నిర్వహించే జనగణనతోపాటే సమగ్ర కులగణన చేపట్టాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు కోరారు. మంగళగిరిలోని సంఘం రాష్ట్ర కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. కులగణన జరపడం వల్ల జాతీయ సమైక్యత దెబ్బతింటుందని కేంద్రంలోని బీజేపీ పెద్దలు వ్యాఖ్యానించడం సరికాదన్నారు. కాంగ్రెస్, బీజేపీలు అధికారంలో ఉన్నప్పుడు ఒకలా, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మరోలా మాట్లాడుతూ బీసీలను ఓటు బ్యాంకుగా వాడుకుంటూ పబ్బం గడుపుకుంటున్నాయని విమర్శించారు. ఎస్సీ, ఎస్టీల మాదిరిగానే బీసీలకు కూడా అన్ని రంగాల్లో జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు, రాయితీలు ఉండాలన్నారు. సమగ్ర కులగణన జరిపిన తరువాతే స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఈ నెల 25వ తేదీన రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాలలో భారీ ర్యాలీఉ నిర్వహించి, కలెక్టర్లకు వినతి పత్రాలు అందించాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్నవరపు నాగమల్లేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు పారేపల్లి మహేష్, నేతలు మేకా వెంకటేశ్వరరావు, శివరాం బాబాజీ, శివాజీ, జంజనం వరప్రసాద్, పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

24న ఫుట్‌బాల్ లీగ్ టోర్నమెంట్

ఫిరంగిపురం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఫిరంగిపురంలోని మార్నింగ్ స్టార్ కళాశాల ఆట స్థలంలో ఈనెల 24వ తేదీన మండల స్థాయి అండర్ - 14, అండర్ - 17 విభాగంలో బాల బాలికల ఫుట్‌బాల్ లీగ్ టోర్నమెంట్ నిర్వ హిస్తున్నట్టు మండల ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి వంగివరపు శ్రీనివాసరావు గురువారం తెలిపారు. వచ్చే ఏడాది జిల్లా ఫుట్‌బాల్ అసో సియేషన్, జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నిర్వహించే జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో మండలం నుంచే ఎక్కువ మంది క్రీడాకారులను అందించటమే లక్ష్యంగా ఈ ఫుట్‌బాల్ లీగ్ టోర్నమెంట్ జరుపుతున్నామని ఆయన తెలిపారు. స్కూల్ టీమ్స్ తమ ఎంట్రీలను ఆర్గనైజింగ్ కమిటీ నాని, నెంబరు 8885533443కి పంపాలని ఆయన కోరారు.

అనైతిక చర్యలకు పాల్పడితే శిక్షార్హులు

జిల్లా యువజన సర్వీసుల శాఖ మేనేజర్ బీ రాధిక



మాట్లాడుతున్న యువజన సర్వీసుల శాఖ మేనేజర్ బీ రాధిక

ఫిరంగిపురం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): యువత ఈవ్‌టీజింగ్, అనైతిక చర్యలకు పాల్పడటం వల్ల సమాజంలో గౌరవాన్ని కోల్పోవటమే కాక చట్ట పరిధిలో శిక్షలు అనుభవించాల్సి వస్తుందని జిల్లా యువజన సర్వీసుల శాఖ మేనేజర్ బీ రాధిక అన్నారు. ఫిరంగిపురంలోని ఆర్‌సీజేసీ కళాశాల ఆవరణలో గురువారం జరిగిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. ఉమెన్ ట్రాఫికింగ్, సెల్ఫ్ డిఫెన్స్‌ల గురించి ఆమె వివరించారు. అలాగే స్త్రీలు మోస పూరిత చర్యల నుంచి ఆత్మరక్షణకు కావాల్సిన మెళకువలను ఆమె వివరించారు. కార్యక్రమంలో ఫిరంగిపురం ఏఎస్ఐ పీ జాన్‌ఖాన్ మాట్లాడుతూ యువత మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా లాంటి నేరాల ద్వారా ఒక్కసారి ఎఫ్ఐఆర్ నమోదైతే ఎలాంటి ప్రైవేట్, ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపిక కాలేరని, భవిష్యత్ అంధకార మవుతుందని ఆయన తెలిపారు. సోషల్ మీడియా క్రైమ్స్, ఫైనాన్షియల్ క్రైమ్స్ నేరాల గురించి బాధితులు టోల్‌ఫ్రీ నెంబరు 230కి ఫోన్ చేసి సమాచారం ఇస్తే పోలీసులు చర్యలు తీసుకుంటారని పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ రంజన్‌బాబు, కమ్యూనిటీ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎండీ సుదర్శన్, యువజన సర్వీసుల శాఖ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, సెయింట్ జేవీఆర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మసీ ప్రిన్సిపాల్ డీ జీవన్ మణిబాబు, స్టెప్ సిబ్బంది, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో పెంకుటిల్లు దగ్ధం

● మూడు కుటుంబాలు రోడ్డు పాలు
● రూ.5 లక్షల ఆస్తి నష్టం అంచనా



దగ్ధమైన పురాతన పెంకుటిల్లు

వట్టిచెరుకూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొర్నెపాడులో బుధవారం అర్ధరాత్రి విద్యుదాఘాతంతో కారణంగా మూడు కుటుంబాలు నివసిస్తున్న పురాతనమైన పెంకుటిల్లు అగ్నికి ఆహుతైంది. మూడు కుటుంబాల వారు కట్టుబట్టలతో బయటపడ్డారు. రెవెన్యూ, పోలీసుశాఖ వెల్లడించిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. కొర్నెపాడు గ్రామంలో ఐదు వాకిళ్ళు గల అతి పురాతనమైన పెంకుటింట్లో షేక్ జానీ సాహెబ్, షేక్ చినబాబు, షేక్ మహబూబ్ సుభానీ కుటుంబాలు ఆ గృహంలో ఉంటున్నారు. ఇటీవల దక్షిణ భాగంలో ఉంటున్న షేక్ జానీ సాహెబ్ తన కుమార్తెను చూసేందుకు కుటుంబసభ్యులతో వెళ్లాడు. మిగిలిన కుటుంబాల వారు ఇంట్లోనే ఉన్నారు. అర్ధరాత్రి వేళలో షేక్ జాన్ సాహెబ్ ఇంట్లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. అందరూ పరుగున బయటకు వచ్చారు. ఇదే సమయంలో రెండో ఇంట్లో గ్యాస్ సిలిండర్లు పేలడంతో మంటలు పెరిగాయి. అటు ప్రజలు, ఇటు అగ్నిమాపక సిబ్బంది కలిసి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ఆ మూడు కుటుంబాలకు చెందిన కట్టుబట్టలతో బయటకు రాగా విలువైన వస్తువులతో పాటు విలువైన డాక్యుమెంట్లు, ఇతర వస్తువులు అలాగే నగదు అగ్నికి ఆహుతైనట్టుగా ఇటు రెవెన్యూ, పోలీసు యంత్రాంగం గుర్తించారు. అగ్ని ప్రమాద సంఘటనతో సుమారు రూ.5 లక్షల వరకు ఆస్తి నష్టం సంభవించి ఉండవచ్చునని అంచనాకు వచ్చారు. ఈ మేరకు బాధితుల ఫిర్యాదు మేరకు వట్టిచెరుకూరు పోలీసులు కేసు నమోదు చేశారు. వట్టిచెరుకూరు డిప్యూటీ తహసీల్దార్ దరియావలి ఆదేశాల మేరకు వీఆర్‌వో గురువారం ఉదయం అగ్ని బాధిత కుటుంబాలకు తక్షణ సాయంగా 25 కిలోల చొప్పున బియ్యం, కంది పప్పు పంపిణీ చేశారు.

ఏసీసీ కార్మికులకు వివిధ సంఘాల నేతల మద్దతు



దీక్షకు మద్దతు తెలుపుతున్న వివిధ సంఘాల నేతలు

తాడేపల్లి టౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఏసీసీ కార్మికుల పోరాటానికి సంయుక్త కిసాన్ మోర్చా, సీఐటీయూ, ఏఐటీయూసీ, ఏఐఎఫ్‌టీయూ (న్యూ), ఐఎన్‌టీయూసీ కార్మిక సంఘాల నాయకులు గురువారం కార్మికుల పోరాట దీక్షా శిబిరాన్ని సందర్శించి వారికి మద్దతు పలికారు. సీఐటీయూ కార్యదర్శి వేముల దుర్గారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో శిబిరం వద్ద సీఐటీయూ నాయకులు బూరుగ వెంకటేశ్వర్లు, కె.కరుణ, కె.బాబూరావు, పి.కృష్ణ, ఏఐఎఫ్‌టీయూ నాయకులు కె ఆదినారాయణ, ఏఐటీయూసీ నాయకులు కె వెంకటయ్యలు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకుని ఏసీసీ కార్మికుల సమస్యను పరిష్కరించి వారికి రావలసిన నష్టపరిహారం ఇప్పించాలని డిమాండ్ చేశారు. ఏసీసీ కార్మికులు చేపట్టే అన్ని పోరాటాల్లో ప్రత్యక్షంగా పాల్గొంటామని అన్ని కార్మిక సంఘాలు తెలిపాయి. ఈ కార్యక్రమంలో కె.స్టీవెన్, బాషా, అంకయ్య, శారమ్మ, సూరి, నవనీతం, సామ్రాజ్యం, రమాదేవి, శారద, దుర్గమ్మ, దుర్గారావు, దానయ్య, సుబ్బారావు, సాంబయ్య కృష్ణ, తదితరులు పాల్గొన్నారు. నిరసన దీక్షలు నేటికి 26వ రోజుకు చేరుకున్నాయి.

26న జరిగే ధర్నాను జయప్రదం చేయాలి

ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు శివశంకరరావు



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న శివశంకరరావు

మంగళగిరి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 26వ తేదీన గుంటూరులో జరిగే మహా ప్రదర్శన, ధర్నాను జయప్రదం చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జొన్న శివశంకరరావు, ఏఐఎఫ్‌టీయూ నేత కూరపాటి కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. మంగళగిరి సీఐటీయూ కార్యాలయంలో గురువారం జరిగిన రైతు సంఘం, సీఐటీయూ, ఏఐటీయూసీ, ఏఐఎఫ్‌టీయూ (న్యూ) నేతల రౌండ్‌టేబుల్ సమావేశంలో వారు మాట్లాడారు. రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర లేదన్నారు. ఎన్నో సంవత్సరాల పోరాట ఫలితంగా సాధించుకున్న కార్మిక హక్కులను కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కాలరాస్తుందని ధ్వజమెత్తారు. దేశ వ్యాపితంగా 576 ప్రజాసంఘాల ఆధ్వర్యంలో 550 జిల్లా కేంద్రాల్లో ధర్నాలు జరుగుతాయని తెలిపారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కేంద్రం విధానాలను బలపరుస్తూ ప్రజలపై భారాలను మోపుతుందని విమర్శించారు. పాలక ప్రభుత్వాలకు వ్యతిరేకంగా జరిగే ఉద్యమాలను విజయవంతం చేయాలని పిలుపుని చ్చారు. ఈ సమావేశంలో నేతలు సత్యనారాయణ, రాఘవులు, చెంగయ్య, టీ ప్రసాద్‌రెడ్డి, వల్లూరి భారతి, పకీరయ్య, ఎం బాలాజీ, టీ శ్రీనివాసరావు, కే వెంకటేశ్వ రరావు, డీ రామారావు తదితరులు పాల్గొన్నారు.

● తాడేపల్లి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతాంగ, ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా నవంబరు 26న గుంటూరులో జరిగే కార్మిక-కర్షక ర్యాలీ సభను జయప్రదం చేయాలని కోరుతూ తాడేపల్లిలో కార్మిక సంఘాలు, రైతు సంఘాల ఆధ్వర్యాన గురువారం స్కూటర్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంకయ్య, సూరి, రామారావు, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

చలపతి కళాశాలకు ఈసీ కౌన్సిల్ అవార్డు



సర్టిఫికెట్లు సాధించిన విద్యార్థులతో కళాశాల సెక్రటరి సుజిత్‌కుమార్, ప్రిన్సిపాల్

తాడికొండ, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): సైబర్ సెక్యూరిటి రంగంలో విద్యార్థుల నైపుణ్యాలను మరింత మెరుగు పరిచేవిధంగా శిక్షణ ఇచ్చిన చలపతి ఇంజనీరింగ్ కళాశాలకు ఈసీ కౌన్సిల్ అవార్డు లభించిందని కళాశాల సెక్రటరి వై సుజిత్‌కుమార్ తెలిపారు. సైబర్ సెక్యూరిటి రంగంలో శిక్షణ పొందిన సర్టిఫికెట్లు సాధించిన విద్యార్థులను గురువారం కళాశాలలో అభినందించారు. ఈ సందర్భంగా సుజిత్‌కుమార్ మాట్లాడుతూ అంతర్జాతీయ ఈసీ కౌన్సిల్ ద్వారా 87 దేశాలకు చెందిన వివిధ కళాశాల్లో చలపతి ఇంజనీరింగ్ కళాశాలకు అకాడమియా బెస్ట్ న్యూకమర్-2024 గ్లోబల్ అవార్డు సాధించిందన్నారు. శిక్షణలో సర్టిఫికెట్లు సాధించిన విద్యార్థులు నైతిక హ్యాకింగ్, నెట్‌వర్క్ భద్రత, ఇతర సైబర్ సెక్యూరిటి డొమైన్‌లలో నైపుణ్యాన్ని కలిగ ఉంటారన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఇంటర్యూల్లో ఎంపికవడంతో పాటు గుర్తింపు పొందుతారన్నారు. ఈ కోర్సుతో పాటు అంతర్జాతీయ సర్టిఫైడ్ నెట్‌వర్క్ డిఫెండర్, సర్టిఫైడ్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్ సెక్యూరిటీ ప్రొఫెషనల్, సర్టిఫైడ్ ఇంటలిజెన్స్ అనలిస్ట్, సర్టిఫైడ్ క్లౌడ్ సెక్యూరిటి వంటి కోర్సులకు ప్రోత్సాహాన్ని అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పొలాల్లో రైతులు అప్రమత్తంగా ఉండాలి

మంగళగిరి సిటీ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ క్షేత్రాల్లో పాములు సంచారం పట్ల రైతులు అప్రమత్తంగా వుండాలని, విషపూరిత పాము కాటువేస్తే వెంటనే వైద్యుని వద్దకు తీసుకువెళ్లి యాంటీ స్నేక్ వీనమ్ ఇచ్చి ప్రాణాలను కాపాడుకోవచ్చని తాడేపల్లి కేఎల్ యూనివర్సిటీ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జీ.చక్రవర్తి సూచించారు. కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో గురువారం మంగళగిరి మండలం నూతక్కి గ్రామంలో పర్యటించి పాము కాటుకు గురైతే తీసుకోవలసిన రక్షణ చర్యలను గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఆర్ సుప్రియ, ఫీల్డ్ కోఆర్డినేటర్ డాక్టర్ పీ శ్రీకాంత్ రెడ్డి, పీ సురేష్, జీ పార్థసారధి వర్మ తదితరులు పాల్గొన్నారు.

ఎరువులు అధిక ధరలకు అమ్మితే కఠిన చర్యలు



ఎరువుల షాపును తనిఖీ చేస్తున్న అంతర్‌జిల్లాల తనిఖీ అధికారి శ్రీమతి కే రామకోటేశ్వరి

ఫిరంగిపురం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఎరువులు, పురుగు మందులు అధిక ధరలకు అమ్మినా, నకిలీ పురుగు మందులను రైతులకు అంట గట్టినా కఠిన చర్యలు తీసుకుంటామని అంతర్ జిల్లాల తనిఖీ అధికారి కే రామకోటేశ్వరి అన్నారు. గురువారం మండలంలోని పురుగు మందుల షాపులను ఆమె తనిఖీ చేశారు. పురుగు మం దులు, ఎరువులకు సంబంధించిన బిల్లులను దుకాణదారులు రైతులకు విధిగా ఇవ్వాలని ఆయన సూచించారు. అలాగే రైతులు తప్పనిసరిగా రసీదులు అడిగి తీసుకోవాలని ఆమె కోరారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి జే వాసంతి తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఆర్ఎంలో ఆకట్టుకున్న పుస్తక ప్రదర్శన



పుస్తక ప్రదర్శనను ప్రారంభిస్తున్న రిజిస్ట్రార్ వినాయక్, వీసీ మనోజ్

మంగళగిరి సిటీ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మంగళగిరిలోని ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో గురువారం నుంచి మూడు రోజులపాటు జరిగే జాతీయ పుస్తక ప్రదర్శన ప్రారంభమైంది. వర్సిటీ సెంట్రల్ లైబ్రరీ విభాగం ఆధ్వర్యంలో ఈ పుస్తక ప్రదర్శనను ఏర్పాటు చేశారు. ఎస్ఆర్ఎం ఉపకులపతి ఆచార్య మనోజ్‌కుమార్ అరోరా, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ కల్లూరి వినాయక్ పుస్తక ప్రదర్శనను ప్రారంభించారు. హైదరాబాద్‌కు చెందిన షా బుక్‌హౌస్, చెన్నయ్‌కు చెందిన శాంతి బుక్‌హౌస్, విజయవాడ ఇస్కాన్ సౌజన్యంతో ఈ పుస్తక ప్రద ర్శన ఏర్పాటు చేశామని వర్సిటీ చీఫ్ లైబ్రేరియన్ జానకీరామన్ తెలిపారు. అకడమిక్, కెరీర్, రీసెర్చ్, లిటరేచర్ విభాగాలకు చెందిన పుస్తకాలతోపాటు ఆధ్యాత్మిక, భావాత్మక, సాంఘీక రచనలతో కూడిన సుమారు 30 వేల పుస్తకాలను విద్యార్థులకు అందుబాటులో ఉంచామని చెప్పారు. దేశీయంగా ఉన్న ప్రఖ్యాత బుక్ పబ్లిషర్స్ విడుదల చేసిన పేరున్న పుస్తకాలను అందుబాటులో ఉంచామని, తెలుగు, హిందీ, ఇంగ్లిష్ భాషల్లో ముద్రితమైన పలు గ్రంథాలు ఉన్నా యని వివరించారు. కార్యక్రమంలో షా బుక్‌హౌస్ డైరెక్టర్ రాసిన్ షా, ఇస్కాన్ ప్రతినిధులు, ఎస్ఆర్ఎం యూనివర్సిటీ డైరెక్టర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వం ఇళ్ల స్థలాలు కేటాయించాలి

● సీపీఐ నియోజక వర్గ కార్యదర్శి ముప్పాళ్ల శివశంకరరావు

తాడికొండ, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించిన విధంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఇస్తానని చెప్పిన ఇళ్ల స్థలాలను కేటాయించాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ముప్పాళ్ల శివశంకరరావు కోరారు. గురువారం తాడికొండ పంచాయతీ కార్యదర్శి హరిబాబుకు ఇళ్ల స్థలాల దరఖాస్తులను గ్రామస్తులు సీపీఐ నాయకులతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 80 మంది లబ్ధిదారులు దరఖాస్తులు చేసుకున్నారని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు మూడు సెంట్లు, పట్టణంలో రెండు సెంట్ల స్థలాలను ఇస్తానని చెప్పిన మాటను నిలబెట్టుకోవాలన్నారు. ఇళ్ల నిర్మాణానికి రూ.5 లక్షలు కేటాయించాలన్నారు. పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించి వారిని ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కాబోతు ఈశ్వరరావు, తోకల అనురాధ తదితరులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు సిబ్బంది కృషి చేయాలి

● గుంటూరు సౌత్ డివిజన్ పోలీసు అధికారి మల్లికార్జునరావు

కాకుమాను, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నేరాల నియంత్రణకు పోలీసు సిబ్బంది కృషి చేయాలని గుంటూరు సౌత్ డివిజన్ పోలీసు అధికారి మల్లికార్జునరావు అన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌ను గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. స్టేషన్‌లో రికార్డుల తనిఖీ నిర్వహించారు. స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. కాకుమాను, పెదనందిపాడు మండలాల మహిళా కానిస్టేబుల్స్, స్టేషన్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. గ్రామాల్లో సీసీటీవీలను స్థానిక గ్రామ పెద్దల సహకారంతో ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ట్రాఫిక్ నియంత్రణ, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడం వంటి పలు అంశాలపై ఎస్ఐ పృథ్వీ ఏకనాథ్‌కు సూచించారు. కార్యక్రమంలో ఏఎస్ఐలు, హెచ్‌సీలు, కానిస్టేబుల్‌లు తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ కలహాల నేపథ్యంలో వివాహితుడి మృతి

పెదనందిపాడు, నవంబరు, 21 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాల నేపథ్యంలో వివాహితుడు మృతి చెందిన ఘటన గురువారం అబ్బినేనిగుంటపాలెంలో జరిగింది. స్థానికులు, పోలీసుల వివరాల ప్రకారం ఎస్సీ కాలనీకి చెందిన కొచ్చెర్ల జయరాజు(30) బుధవారం రాత్రి అధికంగా మద్యం తాగి నిద్రిస్తుండగా శ్వాస తీసుకోవడం ఆగిపోయినట్లు కుటుంబసభ్యులు గమనించి 108కు సమాచారం ఇచ్చి చికిత్స నిమిత్తం గుంటూరు తరలించారు. అప్పటికే అతడు మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. మృతుడి తాత చింతా వెంకటేశ్వర్లు ఫిర్యాదు మేరకు ఘటనా స్థలానికి పోలీసులు చేరుకొని వివరాలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మధుపవన్ తెలిపారు.

వివాహిత అదృశ్యంపై కేసు నమోదు

తుళ్లూరు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని దొండపాడు గ్రామానికి చెందిన కొసనం ఆశాజ్యోతి అదృశ్యమైందని తుళ్లూరు పోలీసుస్టేషన్‌లో ఆమె సోదరుడు పి.కోటేశ్వరావు గురువారం ఫిర్యాదు చేశాడు. ఈ నెల 16న ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆమె తిరిగి రాలేదని ఫిర్యాదులో తెలిపాడు. తుళ్లూరు ఎస్ఐ అంకమ్మ కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ గంగా వెంకటేశ్వర్లు తెలిపారు.

26న గుంటూరులో ర్యాలీ

తెనాలి అర్బన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 26న గుంటూరులో జరిగే ర్యాలీని జయప్రదం చేయాలని రైతు సంఘం నాయకులు ములకా శివసాంబిరెడ్డి కోరారు. చెంచుపేట ప్రజా సంఘాల కార్యాలయంలో గురువారం షేక్ హుస్సేన్ వలి అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పంట చేతికి అందిన తరుణంలో చౌకగా అమ్ముకోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. గిట్టుబాటు ధర కోసం ర్యాలీ నిర్వహిస్తున్నామన్నారు. కె.బాబూప్రసాద్, రాజ్యలక్ష్మి, గురుబ్రహ్మం, సాంబ శివరావు, కుమారి పాల్గొన్నారు.



జడ్పీటీసీ పిల్లి ఉమాప్రణతికి వినతిపత్రం అందిస్తున్న 104 సిబ్బంది

104 సేవలను ప్రభుత్వమే నిర్వహించాలి

● జడ్పీటీసీకి సిబ్బంది వినతి

తెనాలి రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పీహెచ్‌సీల్లో వైద్య శిబిరాలు నిర్వహిస్తూ పేదప్రజల ఆరోగ్యానికి భరోసాగా నిలుస్తున్న 104 సేవలను ప్రభుత్వమే నిర్వహించాలని సీఐటీయూ 104 జిల్లా అధ్యక్షుడు సత్యరాజ్ కోరారు. గురువారం మండలంలోని కొలకలూరులో జడ్పీటీసీ పిల్లి ఉమాప్రణతిని ఉద్యోగులతో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సత్యరాజ్ మాట్లాడుతూ గత ప్రభుత్వం అరబిందో సంస్థ ద్వారా 104 సేవలను నడిపించిందని ఆ సంస్థ ఉద్యోగులకు సకాలంలో జీతాలు కూడా చెల్లించడంలేదని ఫలితంగా పస్తులుండే పరిస్థితి నెలకొందన్నారు. పేదల ఆరోగ్యానికి అనుక్షణం పనిచేసే తమకు కూటమి ప్రభుత్వం న్యాయం చేయాలన్నారు. ఇప్పటికే మూడు నెలల నుంచి వేతనాలు అందడంలేదని అరబిందో సంస్థ నుంచి 104 సేవలను నిలిపివేసి ప్రభుత్వమే నిర్వహించాలన్నారు. ప్రభుత్వ జీవో నెంబరు 7ను అనుసరించి వేతనాలు చెల్లించి ఉద్యోగులకు భరోసాగా నిలవాలని కోరారు. పీఎఫ్, ఈఎస్ఐ విషయంలో కూడా తీవ్రంగా అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం దృష్టిపెట్టి తగిన న్యాయం చేయాలని కోరారు. మరో రెండు రోజుల్లో జరిగే సమావేశంలో ఈ విషయంపై ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని ఉద్యోగులకు జడ్పీటీసీ సభ్యురాలు ఉమాప్రణతి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వరరెడ్డి, పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీపీ నామా సుబ్బారావు మృతి



సుబ్బారావు (ఫైల్ ఫొటో)

పొన్నూరు టౌన్, నవంబరు 21 (ఆంధ్ర జ్యోతి): పొన్నూరు మండల పరిషత్ మాజీ అధ్యక్షుడు నామా సుబ్బారావు (80) గురువారం అనారోగ్యంతో మృతి చెందారు. మండల పరిధిలోని కట్టెంపూడి గ్రామానికి చెందిన నామా సుబ్బారావు తెలుగుదేశం పార్టీ నుంచి ఎంపీటీసీగా ఎన్నికై 2001-06 వరకు ఎంపీపీగా పనిచేశారు. సుబ్బారావు మృతి వార్త తెలుసుకున్న పలువురు టీడీపీ నాయకులు సుబ్బారావు మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

ఘనంగా సత్యసాయి బాబా జయంతి

పొన్నూరు టౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): సత్యసాయిబాబా 99వ జయంతి వేడుకల సందర్భంగా నిడుబ్రోలు సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సత్యసాయి, షిర్డీసాయి చిత్రపటాల వద్ద కార్తీక దీపోత్సవం జరిపారు. 11 మంది మహిళలకు సీమంతాలు చేసి నిత్యావసరాలు పంపిణీ చేశారు. 99వ జన్మదిన వేడుకల సందర్భంగా ఈ నెల 24వ తేదీ వరకు ప్రత్యేక పూజలు నిర్వహించనునట్లు సేవా సమితి కన్వీనర్ నన్నపనేని ఉత్తేజ్ కుమార్, మల్లంపాటి నాగవల్లి తెలిపారు.

పల్లె పండుగ పనులు రెండు రోజుల్లో ప్రారంభించాలి

● డ్వామా పీడీ శంకర్

గుంటూరు సిటీ, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లాలో పల్లె పండుగలో గుర్తించి, తీర్మానించిన పనులను రానున్న రెండు రోజుల్లో ప్రారంభించాలని డ్వామా పీడీ శంకర్ ఆదేశించారు. గురువారం గుంటూరు అటవీశాఖ కార్యాలయంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలు తీరుపై జిల్లాలోని మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, ఏపీవోలు ఇతర మండల స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో డ్వామా పీడీ మాట్లాడుతూ గ్రామ సభలలో తీర్మానించిన పనులను ప్రభుత్వం నిర్దేశించిన సమయయంలో పూర్తి చేయాలన్నారు. పనులను గుర్తించేటప్పుడు శాశ్వత ఆస్తుల కల్పనకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. పల్లె పండుగ కార్యక్రమంలో చేపట్టి, మంజురు చేసిన సీసీ రోడ్లు, క్యాటిల్ షెడ్లు, ఫాంపాండ్లు, రూఫ్‌వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్లు వంటి పనులను రాబోయే రెండు రోజులలో ఖచ్చితంగా నిర్మాణం ప్రారంభించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా మండల పరిషత్ అభివృద్ధి అధికారులకు ఎస్ఐసీ సాఫ్ట్‌వేర్ వినియోగం గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ ముఖ్య కార్య నిర్వహణాధికారి వి.జ్యోతిబసు, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ పోతురాజు, ఏపీడీ శివన్నారాయణ, క్వాలిటీ కంట్రోల్ ఆఫీసర్ శాంతారావు, జిల్లా విజిలెన్స్ అధికారి సి.హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

యడ్లపల్లి చానల్ మురుగుమయం

● మురుగుబారిన పది వేల ఎకరాలు
● చౌడు భూములవుతున్నాయని రైతుల ఆందోళన
● తగ్గిపోతున్న పంట దిగుబడులు
● మురుగునీటి కట్టడికి కొరవడిన ప్రణాళిక
● పట్టించుకోని ప్రజా ప్రతినిధులు, అధికారులు



తెనాలి మురుగునీటితో నిండిన యడ్లపల్లి చానల్

తెనాలి క్రైం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని వివిధ ప్రాంతాల నుంచి విడుదల అవుతున్న మురుగు నీటితో పది వేల ఎకరాల పంట భూములను మున్సిపల్ అధికారులు ముంచివేస్తున్నారు. పట్టణ శివారు గ్రామాల్లోని పది వేల ఎకరాల్లో పంట భూములు ఈ మురుగు నీటివలన చౌడు భూములుగా మారుతున్నాయి. దీనిపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయినా మున్సిపల్ అధికారులు గాని, రాజకీయ నాయకులు గాని దీనిపై పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని, విలువైన భూములను వ్యర్థంగా ఉంచుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పట్టణం విస్తరిస్తున్నది, శివారు పట్టణ పంట భూముల్లో కూడా నూతన అపార్ట్‌మెంట్లు, ఇండ్ల నిర్మాణం, కాలనీలు రూపొందుతున్నాయి. వీటి నుంచి మురుగునీరు, వ్యర్థాలను మున్సిపల్ అధికారులు పంట కాల్వల్లోకి విడుదల చేయడంతో ఆ పంట భూములు బీడు భూములుగా మారుతున్నాయి. పట్టణం గుండా మూడు ప్రధాన కాల్వలు ప్రవహిస్తున్నాయి. పట్టణంలోని మురుగంతా ఎక్కడికక్కడ ఈ కాల్వల్లోకే విడుదల అవుతుంది. ఈ మురుగు కలవకుండా మున్సిపల్ అధికారులు ఏవిధమైన ప్రణాళికలు అమలు చేయటం లేదు. వైకుంఠపురం వద్ద పడమర కాల్వ నుంచి యడ్లపల్లి చానల్ ఏర్పాటు జరిగింది. ఈ కాల్వ కింద 15 వేల ఎకరాల్లో పంట భూములు సాగవుతున్నాయి. పెదరావూరు, పినపాడు, చినపరిమి, యడ్లపల్లి, పెదగాదెలవర్రు, కార్మూరువారిపాలెం, చినగాదెలవర్రు, వలివేరు, చుండూరు గ్రామాలకు చెందిన పంట భూములు ఈ ఆయకట్టు కిందే ఉన్నాయి. మున్సిపల్ అధికారులు పట్టణంలోని మారీసుపేట, చంద్రబాబు నాయుడు కాలనీ, మల్లెపాడు, పాతబస్టాండ్, పాండురంగపేట, చెంచుపేట చుట్టుపక్కల వెలసిన నూతన కాలనీల్లోని మురుగంతా యడ్లపల్లి కాల్వలోకే విడుదల చేస్తున్నారు. దీంతో కాల్వల్లోకి చేరిన వ్యర్థాలు పంట భూముల్లోకి చేరి భూములు చౌడు బారుతున్నాయి. గతంలో రెండు పంటలు పండే ఈ నల్లరేగడి భూములు ఒక పంట దిగుబడికి కూడా గణనీయంగా తగ్గిపోయింది. ఎకరాకు 40 బస్తాలు పండే ఈ భూముల్లో 20 బస్తాల దిగుబడి కూడా రావటం లేదు. రెండో పంట మొక్కజొన్న 30-40 క్వింటాళ్లు లభించేవి. ఇప్పుడు ఆరు నుంచి పది క్వింటాళ్లకే పరిమితం అవుతున్నాయి. కొన్ని సంవత్సరాలుగా తెనాలి పట్టణ మురుగంతా ఈ పంట పొలాల్లోకి చేరడంతో భూములు సారాన్ని కోల్పోయి చౌడుబారాయి. సాగు సమయంలో పొలాల్లో దిగడం వలన రైతులు, కూలీలు దురద, ఎలర్జీ, చర్మ సంబంధ వ్యాధులకు గురవుతున్నాయి. కాల్వ అంచున పొలాల్లో నీటి ప్రవాహానికి కొట్టుకు వచ్చిన గాజు సీసాలు, గాజు పెంకులు, ప్లాస్టిక్, ఇతర వ్యర్థాల వలన పంట భూముల్లో మురుగు నీటి నుంచి దుర్గంధం వెలువడుతుందని రైతులు ఆరోపిస్తున్నారు. పంటల సాగు వలన లభించే ఎండుగడ్డి, పచ్చిగడ్డి, పశువులకు వేయడం వలన అవి కూడా గర్భకోశ వ్యాధులకు గురవుతున్నాయని, పాల దిగుబడులు కూడా తగ్గుతున్నాయని రైతులు చెబుతున్నారు. ఎంతో సారవంతమైన పంట భూములు మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం వలన ఉప్పుకయ్యాలుగాను చౌడు భూములుగా మారాయి. రానున్న వేసవిలోనైనా ఈ కాల్వల్లోకి మురుగు నీరు చేరకుండా చర్యలు తీసుకోవాలని, వ్యర్థాలు తొలగించి కాల్వ చివరి భూముల వరకు సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ భూముల్లో సాగు వలన పెట్టుబడి ఖర్చులు కూడా రావడం లేదని, భూములను బీడులుగా మార్చుకోలేక తప్పనిసరి పరిస్థితుల్లో సాగు చేయాల్సిన దుస్థితి ఏర్పడిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితులను రాజకీయ నాయకులు, మున్సిపల్ అధికారులు అర్థం చేసుకుని భూములు సాగయ్యే విధంగా చేయాలని పట్టణ శివారు భూముల రైతులు కోరుతున్నారు.

అన్నవరంలంక సమీపంలో వంతెన నిర్మాణానికి ప్రణాళిక సిద్ధం

● ఎంపీ, ఎమ్మెల్యే ఆదేశాలతో అధికారులు, వరంగల్ యూనివర్శిటీ ప్రొఫెసర్ల పరిశీలన



అన్నవరంలంక సమీపంలో వంతెన నిర్మాణానికి కృష్ణానదిని పరిశీలిస్తున్న అధికారులు

కొల్లిపర, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కొల్లిపర మండలం అన్నవరంలంక గ్రామాల ప్రజల చిరకాలవాంఛ నెరవేరనుంది. ఎన్నోఏళ్లుగా ఎదురు చూస్తున్న కృష్ణా నదిపై వంతెన నిర్మాణంపై అధికారులు కసరత్తు ప్రారంభించారు. కేంద్ర మంత్రి గుంటూరు ఎంపీ డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర పౌరసరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశాల మేరకు అధికారులు, వరంగల్ యూనివర్శిటీ ప్రొఫెసర్లు శంకర్, రాజకుమార్, సాయిల్‌టెస్ట్ డిజైనర్ దేవేంద్రరెడ్డి, ఎస్ఈ బ్రహ్మయ్య, పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మృత్యుంజబాబు, డీఈ కృష్ణారెడ్డి ఏఈ బి. కిశోర్, తదితరులు గురువారం పరిశీలించారు. ఇటీవల కృష్ణానదికి వచ్చిన వరదలు సమయంలో అన్నవరంలంకకు కేంద్ర మంత్రి, గుంటూరు ఎంపీ డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ రావటంతో లంక గ్రామాల ప్రజలు వంతెన నిర్మాణం గురించి వారి దృష్టికి తీసుకువచ్చారు. దీంతో స్పందించిన మంత్రులు వంతెన నిర్మాణం గురించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి నిర్మాణం చేపట్టనున్నట్లు హామీ ఇచ్చారు. దీంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉన్నతాధికారులు వంతెన నిర్మాణం కొరకు కృష్ణానది నుంచి అన్నవరంలంక వరకు సుమారు రూ.80 కోట్లు వ్యయంతో వంతెన నిర్మాణంకోసం సన్నాహాలు ప్రారంభించారు.

రోడ్ల మరమ్మతులకు నిధుల కేటాయింపుపై టీడీపీ నేతల హర్షం

● ఉప్పలపాడు నుంచి కాజ గ్రామ రహదారి కోసం రూ .2 కోట్లు ● సీఎం, పవన్ కల్యాణ్, పెమ్మసాని, నరేంద్రలకు ప్రత్యేక కృతజ్ఞతలు

పెదకాకాని, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఉప్పలపాడు నుంచి వయా నంబూరు గ్రామం మీదుగా కాజ గ్రామం వరకు, జాతీయ రహదారి నుంచి నంబూరు గ్రామం వరకు ఉన్న రోడ్ల మరమ్మతులకు రూ.2 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసినట్లు పెదకాకాని మండల టీడీపీ అధ్యక్షుడు వలివేటి మురళీకృష్ణ తెలిపారు. గురువారం పెదకాకాని పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిధులు కేటాయించినందుకు సీఎం నారా చంద్రబాబు నాయుడు, ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, కేంద్రమంత్రి పెమ్మసాని, ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్‌లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా వలివేటి మురళీకృష్ణ మాట్లాడుతూ ఉప్పలపాడు గ్రామం నుంచి వయా నంబూరు గ్రామం మీదగా కాజ గ్రామం వరకు, జాతీయ రహదారి నుంచి నంబూరు గ్రామం వరకు ఉన్న రోడ్లు 2014 నుంచి 2019 మధ్య కాలంలో ప్రభుత్వం నిర్మించింది. అనంతరం ఈ రహదారులపై ఏర్పడిన గుంతను వైసీపీ ప్రభుత్వం పూడ్చకపోవటంతో అవి పెద్దవి అయి వాహనాల రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్, పొన్నూరు నియోజకవర్గ శాసనసభ్యుడు ధూళిపాళ్ళ నరేంద్రకుమార్‌లు పరిశీలించి, ఈ రోడ్లను వేయించేందుకు హామీ ఇచ్చారు. ఇటీవల కురిసిన వరదలకు ఉప్పలపాడు గ్రామం శ్మశానం దగ్గర వున్న చప్టా దగ్గర జరిగిన ప్రమాదంలో ముగ్గురు మరణించగా ఈ చప్టాను పరిశీలించిన ఎంపీ, ఎమ్మెల్యేలు ఇక్కడ పెద్ద కల్వర్టు నిర్మించేందుకు హామీ ఇచ్చారన్నారు. దీనిని పురస్కరించుకుని రోడ్ల మరమ్మతులు, కల్వర్టులకు నిధులు కేటాయించాలని సీఎంను ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ కోరిన వెంటనే రూ.2 కోట్లు కేటాయించారని తెలిపారు. సమావేశంలో మండలంలోని తెలుగుదేశం -జనసేన -బీజేపీ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, పాల్గొన్నారు.



పారిశుధ్య కార్మికులకు కిట్స్‌ను పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక, కమిషనర్ శేషన్న ఎంహెచ్‌వో డాక్టర్ హెలెన్ నిర్మల తదితరులు

కార్మికుల ఆరోగ్య పరిరక్షణకే పీపీఈ కిట్స్

● మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక

తెనాలి మారీసుపేట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికుల ఆరోగ్య పరిరక్షణకు పీపీఈ కిట్స్‌ను పంపిణీ చేస్తున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అన్నారు. పట్టణ పురపాలక సంఘ కార్యాలయంలో గురువారం మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక కమిషనర్ శేషన్నతో కలసి కేంద్ర ప్రభుత్వం వారి నమస్తే పథకంలో భాగంగా పీపీఈ కిట్స్‌ను పారిశుధ్య కార్మికులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పారిశుధ్య కార్మికుల ఆరోగ్య పరిరక్షణకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నేషనల్ యాక్షన్ ఫర్ మెకనైజ్డ్ శానిటేషన్ ఎకోసిస్టమ్ (నమస్తే) పథకం ద్వారా 9 రకాల రక్షణ పరికరాలతో కూడిన కిట్లను 8మంది పారిశుధ్య కార్మికులకు అందించామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ హెలెన్ నిర్మల, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ తవ్వకాలు జరిపితే చర్యలు : ఆర్డీవో

బాపట్ల, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా ఇసుక అక్రమంగా తవ్వి తరలిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఆర్డీవో పి.గ్లోరియా హెచ్చరించారు. పడమర బాపట్ల గ్రామపంచాయతీ పరిధిలో ఇసుక అక్రమంగా తవ్విన ప్రాంతాలను మైనింగ్ ఏడీ రాజేష్, డీఎస్పీ రామాంజనేయులు, రెవెన్యూ సిబ్బందితో కలిసి గురువారం ఆమె పరిశీలించారు. ఇసుకను తవ్విన ప్రాంతాలను పరిశీలించి ఇసుక తీయాలన్న అనుమతులు తప్పనిసరి అని చెప్పారు. తవ్వకాలు జరిపిన ప్రాంతాలను గుర్తించి ఎంత పరిమాణంలో ఇసుక తీసింది పరిశీలించారు. ఈ సందర్భంగా మైనింగ్ ఏడీ రాజేష్ మాట్లాడుతూ గడిచిన మూడునెలల్లో అక్రమంగా ఇసు క తరలిస్తున్న 69 వాహనాలను అదుపులోకి తీసుకొని వారి దగ్గర రూ.10,15,724 అపరాధ రుసుం వసూలు చేసినట్లు తెలిపారు. అదేవిధంగా గత ఏడాది మేనెల నుం చి ఈ నెల నవంబరు వరకు వివిధ ప్రాంతాల్లో అక్రమ తవ్వకాలు జరిపే ప్రాంతాలను గుర్తించి 39 కేసులు నమోదు చేశామన్నారు. తవ్విన ఇసుకకు 10రెట్లు అదనంగా జరిమానా విధించామన్నారు. వీటికి సంబంధించి 9కోట్ల రూపాయలు అపరాధం విధించామన్నారు. సంబంధిత వ్యక్తులకు డిమాండ్ నోటీసులు పంపించామన్నారు. స్పందించని వారికి రెవెన్యూ రికవరి చట్టం కింద చర్యలు తీసుకునేందుకు నోటీసులు మరోసారి ఇచ్చామన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ, పోలీసు, మైనింగ్ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే పెనుమూడి కృష్ణానది వద్ద ఇసుక అక్రమ తవ్వకాలపై తహసీల్దార్ మోర్ల శ్రీనివాసరావు, పట్టణ సీఐ మల్లికార్జునరావులు పరిశీలించారు.

సామాజిక సేవకు వాసవి క్లబ్‌ల ముందంజ

● క్లబ్ గవర్నర్ పూవాడ నాగ వెంకట నారాయణ

పొన్నూరుటౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): వాసవి క్లబ్‌లు సామాజిక సేవలో ముందంజలో ఉన్నాయని క్లబ్ గవర్నర్ పూవాడ నాగవెంకట నారాయణ అన్నారు. గురువారం మెడికల్ వెల్ ఫేర్ అసోసియేషన్ కల్యాణ మండపంలో వాసవి క్లబ్ సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన గవర్నర్ చేతుల మీదుగా అనాథ శరణాలయానికి రూ.50 వేల విలువైన దుప్పట్లు, దోమ తెరలు, నిత్యావసర సామగ్రిని అందించారు. ఈ సందర్భంగా క్లబ్ సభ్యులను గవర్నర్ సన్మానించారు. కార్యక్రమంలో వాసవి ఇంటర్నేషనల్ సీనియర్ వైస్‌ప్రెసిడెంట్ నుగ్గుల ప్రశ్నరావు, కోళ్లపూడి కళ్యాణి, రూపేష్, పొన్నూరు క్లబ్ అధ్యక్షుడు ఎ కిషోర్, సృజన్, వెల్లంపల్లి ప్రసాద్, వీవీ గుప్తా, పొత్తూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



శరణాలయానికి నిత్యావసర సామాగ్రిని అందచేస్తున్న వాసవి క్లబ్ గవర్నర్ వెంకటనారాయణ

అఖిలపక్ష కార్మిక సంఘాల సమావేశం

పెదకాకాని, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పెదకాకానిలో ఈ నెల 26న జరిగే ర్యాలీ, సభలను జయప్రదం చేయాలని అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. గురువారం అఖిలపక్ష కార్మిక సంఘాలు సంయుక్త కిసాన్ మోర్చా సంఘాల ఆధ్వర్యంలో స్థానిక సీఐటీయూ కార్యాలయంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి నన్నపనేని శివాజీ ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి పుప్పాల సత్యనారాయణ రైతు కూలీ సంఘం నాయకులు దానబోయిన భాస్కరరావులు మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ సంకీర్ణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటికీ తమ విధానాల్లో మార్పు లేదన్నారు. అన్ని ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణకు పూనుకుందన్నారు. 44 కార్మిక చట్టాలను నిర్వీర్యం చేసి నాలుగు లేబర్ కోడులను తీసుకొచ్చారన్నారు. రైతుల ఉత్పత్తులకు ఉత్పత్తి ఖర్చు కుటుంబ శ్రమ విలువకు మరో 50శాతం కలిపి కనీస మద్దతు ధర నిర్ణయించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థల్లో ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని ఈ నెల 26వ తేదీ ఉదయం 10 గంటలకు గుంటూరు శంకర్ విలాస్ సెంటర్ నుంచి మార్కెట్ సెంటర్ వరకు జరుగు ర్యాలీ జరుగుతుందన్నారు. అనంతరం జరిగే బహిరంగ సభలో కార్మికులు ఉద్యోగ సంఘాలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు కూరపాటి కోటయ్య సీఐటీయూ మండల కార్యదర్శి దీవి నరసింహారావు కే సత్యనారాయణ వి శివయ్య బి బాబురావు బి సాంబయ్య ఏనుపాదం తదితరులు పాల్గొన్నారు

మహిళా సాధికారతే లక్ష్యంగా మెప్మా సేవలు

● మెప్మా సిటీ మిషన్ మేనేజర్ విజయకుమారి

ఫటాఫట్



తెనాలి, మారీసుపేట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మహిళా సాధికారతే లక్ష్యంగా మెప్మా సేవలు అందిస్తున్నామని రాబోయే రోజుల్లో ప్రతి మహిళ కుటుంబానికి చేదోడువాదోడుగా నిలిచేలా ప్రణాళికతో ముందుకు సాగుతున్నామని మెప్మా సిటీ మిషన్ మేనేజర్ విజయకుమారి చెప్పారు. గురువారం ఆంధ్రజ్యోతితో మెప్మా సేవలపై ఆమె తెలిపిన వివరాలు..

ప్రశ్న: మహిళల అభ్యున్నతికి ఎటువంటి ప్రణాళికలు రూపొందిస్తున్నారు ?

జ: ప్రతి కుటుంబంలో మగవారికి చేదోడు వాదోడుగా మహిళలు నిలబడేలా స్వయం సహాయక సంఘాల ద్వారా రుణాలు అందించి వాటి ద్వారా కుటీర పరిశ్రమలను ప్రోత్సహిస్తూ వారి అభ్యున్నతికి ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నాము.

ప్రశ్న: ఎన్ని స్వయం సహాయక సంఘాలు ఉన్నాయి?

జ: మెప్మా పరిధిలో 2810 స్వయం సహాయక సంఘాలు ఉన్నాయి.

ప్రశ్న: ఎంతమంది సభ్యులను గ్రూప్‌గా చేరుస్తారు?

జ: ప్రతి గ్రూప్‌కు 10మంది మహిళలు, వారందరు స్థానికులై ఉండాలి.

ప్రశ్న: గ్రూప్‌లకు ఏవిధంగా రుణాలు ఇస్తారు?

జ: స్థానిక బ్యాంకులకు గ్రూప్ వివరాలు పంపిస్తాం. వారికి ఎంత మొత్తంలో అవసరమవుతాయనే అంచనా ముందుగా మా వద్ద ఉంటుంది. దానిని బట్టి రుణాలు ఆయా బ్యాంకులతో మాట్లాడి రుణాలు మంజూరు చేయిస్తాం.

ప్రశ్న: రుణాలను ఏ విధంగా సద్వినియోగం చేసుకునేలా ప్రోత్సహిస్తారు?

జ: సభ్యులు తమ ఇంటి వద్దనే గ్రూప్‌గా చేరి చిరు తినుబండారాలు, పచ్చళ్ల, అప్పడాలు, చేనేత పనులు, పిండిమరలు ఇలా వారికి నచ్చిన వ్యాపారాన్ని చేసుకొని ఆదాయాన్ని పెంచుకునేలా ప్రోత్సహిస్తాం.

ప్రశ్న: స్వయం సహాయక సంఘాలకు ప్రత్యేక ప్రోత్సాహకంగా ఏం చేస్తున్నారు?

జ: మెప్మా అర్బన్ మార్కెట్‌ల ద్వారా నెలకు రెండు రోజులు పాటు గ్రూప్ సభ్యులు తయారుచేసిన ఉత్పత్తుల అమ్మకాలకు ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటుచేసి వాటిద్వారా నేరుగా వినియోగదారులకు అమ్ముకునేలా ప్రోత్సహిస్తున్నాం.

ప్రశ్న: మెప్మా అర్బన్ మార్కెట్లు ఆశించిన ఫలితాలు వస్తున్నాయా?

జ: వస్తున్నాయనే చెప్పాలి.. వినియోగదారులు అమ్మకాలు జరిపే ఉత్పత్తుల నాణ్యతలు బాగుండటంతో కొనుగోలు చేస్తున్నారు.



సమస్య ఇది.. స్పందించరూ

నీడనిచ్చే చెట్ల నరికివేత

బోసురోడ్డు విస్తరణ పేరుతో ఏపుగా పెరిగిన నీడనిచ్చే చెట్లను నిర్దాక్షిణ్యంగా తొలగిస్తున్నారు. చెట్ల లైనులోనే విద్యుత్ స్తంభాలు ఉన్నప్పటికీ వాటిని వెనక్కి జరపకుండా చెట్లను మాత్రమే తొలగించడం ఏమిటంటూ పలువురు విమర్శిస్తున్నారు. మొక్కలు నాటాలి, చెట్లను సంరక్షించాలి అని పర్యావరణ సూక్తులు చెప్పే అధికారులు ఇందుకు ఏం సమాధానం చెబుతారని ప్రశ్నిస్తున్నారు - తెనాలి అర్బన్, ఆంధ్రజ్యోతి



వెల్లలూరు పాఠశాలలో విద్యార్థుల ప్రతిభను పరీక్షిస్తున్న ఎంఈవో

పది పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

● ఎంఈవో శ్రీనివాసరెడ్డి

పొన్నూరు టౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): 10వ తరగతి పరీక్షా ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచేలా విద్యార్థులు కృషిచేయాలని ఎంఈవో శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని వెల్లలూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థుల ప్రత్యేక తరగతులను గురువారం ఎంఈవో పరిశీలించారు. గణిత పాఠ్యాంశాలలో విద్యార్థుల ప్రతిభను పరీక్షించారు. విద్యార్థులు పది పరీక్షలో మెరుగైన ఫలితాలు సాధించేలా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న రాష్ట్ర వలంటీర్స్ అసోసియేషన్ నాయకులు

వలంటీర్లను కొనసాగించాలని నిరసన

పొన్నూరు టౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం వలంటీర్ల సేవలను యథావిధిగా కొనసాగించాలని ఆంధ్రప్రదేశ్ వలంటీర్ల అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు ఆరేటి రామారావు డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని ఐలాండ్ సెంటర్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వలంటీర్స్ అసోసియేషన్, ఏఐవైఎఫ్ అనుబంధ సంస్థ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. కళ్లకు నల్లగంతలు కట్టుకొని నిరసన ప్రదర్శనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వలంటీర్ల సంఘ నాయకులు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో వలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పిస్తామని, రూ.10వేల వేతనం ఇస్తామని హామీఇచ్చారని గుర్తు చేశారు. ఇచ్చిన హామీమేరకు వలంటీర్ల వ్యవస్థలు కొనసాగించటంతోపాటు ఐదు నెలలుగా పెండింగ్ ఉన్న వేతనాలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యాక్షుడు గద్దె వెంకట ప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి జంగాల చైతన్య, వలంటీర్లు షేక్ జానీ, గోపి, బాజీ, మహేశ్వరి, పర్వీన్ తదితరులు పాల్గొన్నారు.